ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 133, పేజీలు - 08

శనివారం, నవంబర్ 14, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



నా ఫోన్ ట్యాప్ చేసుకోండి ఏం ఇబ్బంది లేదు

ఫోన్ ట్యాపింగ్‌పై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ పూర్తి కావొచ్చిందని, ఈ కేసులో త్వరలోనే కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన ఫోన్ ట్యాపింగ్ చేసినా తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఫోన్ ట్యాప్ చేసి తన మాటలు ఏమైనా వినొచ్చు అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'భారత్ సమ్మిట్' ద్వారా తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని ప్రపంచానికి తెలియజేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

2లో..

భారత్ చొరవ వల్లే ప్రపంచవ్యాప్తంగా

యోగా దినోత్సవం

బెంగళూరులో ఎస్-వ్యాస స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ



బెంగళూరు (ప్రశ్న న్యూస్)భారతీయ ప్రాచీన సంస్కృతికి ప్రతీక అయిన యోగా ఇటు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సరికొత్త చరిత్ర సృష్టిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉన్న స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థ (ఎస్-వ్యాస) రెసిడెన్షియల్ హెడ్‌క్వార్టర్స్ క్యాంపస్ 'ప్రశాంతి కుటీరం' స్వర్ణోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశం చేపట్టిన వివిధ చొరవలు, కృషి ఫలితంగానే నేడు యోగా ప్రపంచవ్యాప్తంగా నలుమూలలా విస్తరించిందని, ప్రతి దేశంలోనూ దీనికి అపూర్వమైన ఆదరణ లభిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.తాను ఏ దేశానికి అధికారిక పర్యటనకు వెళ్లినా అక్కడి అధినేతలు, ప్రముఖులు మధ్యాహ్న భోజనం లేదా రాత్రి విందు సమావేశాల సమయంలో యోగా గురించే తనతో ప్రత్యేకంగా చర్చిస్తారని ప్రధాని మోదీ వెల్లడించారు. కేవలం సాధారణ ప్రజలే కాకుండా అనేక విదేశీ రాజకుటుంబాలు సైతం యోగాకు పూర్తిగా అంకితమైపోయాయని,

2లో..

హరీశ్ నీళ్ల,నిధుల దొంగ మాత్రమే కాదు

బొగ్గు దొంగ కూడా

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కల్పిస్తామని, రాబోయే ఎన్నికల్లో అక్కడ టీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని కవిత ఆరోపించారు. మాజీమంత్రి హరీశ్ రావును ప్రజా జీవితం నుంచి తరిమేస్తామని హెచ్చరించారు.సిద్దిపేట రంగధాంపల్లి చౌరస్తాలో శుక్రవారం అమరవీరుల స్తూపం సమీపంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయ నిర్మాణానికి కవిత తన భర్త అనిల్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ

2లో..

నా ఫోన్‌ను మోదీ ట్యాప్ చేస్తున్నారు

- రాహుల్ గాంధీ సంచలన ఆరోపణ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తన ఫోన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలతో ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. విదేశీ శక్తుల సాయంతో దేశంలో అరాచకం సృష్టించేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు ఆయన ఈ వ్యాఖ్యలతో బదులిచ్చారు.

2లో..

303 ప్రాజెక్టులు.. రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు



- విశాఖలో ముగిసిన సీఐఐ సదస్సు
- కేవలం ఐదు రోజుల్లో 13 లైసెన్సులతో అనుమతులు ఇచ్చే విధానం అమలు
- పెట్టుబడుల సంరక్షణ కోసం ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకువస్తామన్న సీఎం

అమరావతి (ప్రశ్న న్యూస్) విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా 303 ప్రతిపాదనల రూపంలో ఏపీకి ఏకంగా రూ. 9.89 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, వైద్యం, ఏవియేషన్, ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, చేనేత క్లస్టర్ల వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చాయన్నారు. జూన్ 2024 నుంచి ఈ సమ్మిట్‌కు ముందు వరకు 714 ప్రాజెక్టులకు రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. వీటి ద్వారా 19.3 లక్షల ఉద్యోగాలకు అవకాశం ఉందన్నారు. సీఐఐ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో శుక్రవారం సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 'స్వచ్ఛ షహర్' కేటగిరీలో దేశంలోనే అత్యంత శుభ్రమైన నగరంగా విశాఖపట్నం నిలిచిందని, అలాంటి అద్భుతమైన నగరంలో ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. 'నేవిగేటింగ్ ద న్యూ వరల్డ్ ఆర్డర్' అనే థీమ్‌తో ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్ పేరిట జరిగిన ఈ సదస్సుకు వివిధ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కేంద్ర మంత్రులు హాజరయ్యారు.

2లో..

రెండో రోజు సైతం ఏపీకి పెట్టుబడుల వెల్లువ

- రూ.1.41 లక్షల కోట్లకు పైగా ఒప్పందాలు



అమరావతి (ప్రశ్న న్యూస్) విశాఖపట్నం వేదికగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి భారీ ఊతం లభించింది. సీఐఐ సదస్సు రెండో రోజున రాష్ట్రంలో వివిధ రంగాల్లో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకు వచ్చాయి. ఎయిర్ ట్రంక్- జేసీకే ఇన్ ఫ్రా, జేఎస్‌డబ్ల్యూ, డిక్సన్ టెక్నాలజీస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గ్రీన్ జెన్, కాకినాడ సీపోర్ట్స్ లాంటి ప్రముఖ సంస్థలు ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఇందులో భాగంగా 'ఎయిర్ ట్రంక్-జేసీకే ఇన్‌ఫ్రా' సంస్థలు సంయుక్తంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా రూ. 1,03,018 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించాయి. 3,120 మందికి ఉద్యోగాలు

2లో..

భాగ్యనగరంలో భారత్ సమ్మిట్-2026 షురూ

- ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాలపై హైదరాబాద్ వేదికగా మేధోమథనం
- తొలి రోజు తెలంగాణ రైజింగ్ ఇతివృత్తంతో నాలుగు కీలక ప్యానల్ చర్చలు
- పట్టణీకరణ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమంపై ప్రముఖుల అభిప్రాయాలు
- నేడు రెండో రోజు సదస్సుకు హాజరుకానున్న రాహుల్‌గాంధీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్ర చర్చలకు హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ వేదికగా నిలిచింది. 'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' (నూతన ప్రపంచ నిర్మాణం) ఇతివృత్తంతో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్-2026 రెండో ఎడిషన్ శుక్రవారం హైటెక్స్‌లో ప్రారంభమైంది. తొలిరోజు కార్యక్రమాల్లో భాగంగా 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు కీలక ప్యానల్ చర్చలు నిర్వహించారు. పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలపై దేశవిదేశాలకు చెందిన ప్రముఖులు, నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక సమానత్వం, సంక్షేమ పథకాల అమలు ప్రధాన

2లో..

ప్రపంచంలో అత్యంత

2లో..

కాలుష్య నగరంగా ఢిల్లీ

- 'ఐక్యూఎయిర్' ప్రకారం 334కు చేరిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్



హైదరాబాద్‌లో ఆటో కార్మికులకు

ఇందిరమ్మ ఇళ్లు

- 4 చోట్ల టవర్లు నిర్మించనున్న ప్రభుత్వం

2లో..



హైదరాబాద్‌లో నీటి సంక్షోభం

- జనవరి నుంచి 3.5 లక్షల కనెక్షన్లకు నీరు కట్.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎల్‌నినో దెబ్బకు హైదరాబాద్‌లోని సైబరాబాద్ ఐటీ కారిడార్‌కు త్వరలో నీటి కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్-ఎస్‌బీ) కీలక నిర్ణయానికి రెడీ అవుతోంది. ఈ రెండు రిజర్వాయర్ల నుంచి ప్రస్తుతం అందుతున్న నీటి సరఫరాను భారీగా తగ్గించాలని భావిస్తోంది. జనవరి నుంచి సరఫరా 120 ఎంజీడీల (రోజుకు మిలియన్ గ్యాలన్స్) నుంచి కేవలం 20 ఎంజీడీలకు

3లో..

నా ఫోన్ ట్యాప్ చేసుకోండి

హైదరాబాద్ వాతావరణం పెట్టుబడులకు అనుకూలంగా ఉందని, ఇందులో భాగంగానే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించబోతున్నామని వెల్లడించారు. ఈ సమ్మిట్‌కు సన్నాహకంగా ఇప్పటికే ఢిల్లీతో పాటు పలు ప్రాంతాల్లో కర్టెన్ రైజర్ కార్యక్రమాలు నిర్వహించామని, త్వరలోనే ముంబై, అహ్మదాబాద్ నగరాల్లోనూ నిర్వహిస్తామని తెలిపారు.ప్రస్తుతం జరుగుతున్న భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వివిధ రంగాల్లో ఉన్నత హోదాల్లో ఉన్న ప్రముఖులు నగరాన్ని ప్రత్యక్షంగా చూసి, ప్రభుత్వ పారిశ్రామిక విధానాలను తెలుసుకుంటారనే ఉద్దేశంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడికి వచ్చే ప్రతి అతిథి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, భారత్ సమ్మిట్‌కు ఆహ్వానించిన కొంతమంది విదేశీ ప్రతినిధులకు మొదట అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఆ తర్వాత నిరాకరించడంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభివృద్ధిని వ్యతిరేకిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్

తెలంగాణ ప్రజలకు మేలు చేసే ఏ నిర్ణయం తీసుకున్నా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డు, తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం ఏది చేసినా కిషన్ రెడ్డి, రాంచందర్ రావు, కేటీఆర్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. వారు వ్యతిరేకిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాదని, తెలంగాణ ప్రజల అభివృద్ధిని అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వస్తే స్వాగతించిన బీజేపీ నేతలు, ఇప్పుడు భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీ వస్తుంటే విమర్శించడం తగదన్నారు. కర్టెన్ రైజర్ కార్యక్రమానికి, ఎల్ నినోపై అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించినా కిషన్ రెడ్డి, బండి సంజయ్ హాజరు కాలేదని, అందుకే వారిని తెలంగాణ లెక్కల్లో లేరని భావిస్తున్నామని ఆయన విమర్శించారు.

గిగ్ వర్కర్స్ చట్టం అమలు చేస్తాం

గిగ్ వర్కర్లను ఆదుకునే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని, తెలంగాణలో మాత్రం రేపటి నుంచే గిగ్ వర్కర్స్ చట్టాన్ని అమలు చేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. భారత్ సమ్మిట్ ముగింపు సందేశం ఇచ్చేందుకు హైదరాబాద్ వస్తున్న రాహుల్ గాంధీ చేతుల మీదుగా ఈ చట్టం అమలును ప్రారంభిస్తామని తెలిపారు. ప్రధాని మోదీ విదేశాలకు వెళ్లి ఉపన్యాసాలు ఇస్తే కరెక్టు, రాహుల్ గాంధీ సదస్సులో పాల్గొంటే తప్పు అన్నట్లుగా బీజేపీ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీ బీజేపీని ఓడించి దేశానికి ప్రధాని అవుతారనే భయం వారిలో ఉందన్నారు.ప్రజాస్వామ్యంలో అందరి అభిప్రాయాలు తీసుకుంటామని, సుపరిపాలన కోసం రాజ్యాంగాన్ని 106 సార్లు సవరించుకున్నామని గుర్తు చేశారు. ప్రపంచ శాంతి కోసం చర్చ జరగాల్సిన అవసరం ఉందని, బీజేపీని వ్యతిరేకిస్తే భారతదేశాన్ని వ్యతిరేకించినట్లు కాదని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి ప్రజల మనసుల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ భారతదేశ ఆత్మ అని, ఒకరు విమర్శించినంత మాత్రాన రాహుల్ గాంధీ ప్రతిష్ట తగ్గదని, ఇప్పటికైనా బీజేపీ నేతలు తమ కడుపులోని విషాన్ని తెలంగాణ ప్రజలపై ప్రదర్శించకుండా విజ్ఞత ప్రదర్శించాలని సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు.

భారత్ చొరవ వల్లే ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం

దానిని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకున్నాయని తెలిపారు. భారత దేశాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి, మన సంస్కృతిని తెలుసుకోవడానికి యోగా ప్రస్తుతం ప్రపంచానికి ఒక గొప్ప మార్గంగా ఉపయోగపడుతోందని ఆయన అభివర్ణించారు. బెంగళూరు నగరంలో అడుగు పెట్టిన క్షణం నుంచే యోగా అందించే అద్భుతమైన సానుకూల శక్తిని తాను ప్రత్యక్షంగా అనుభవించగలిగానని మోదీ పేర్కొన్నారు.కర్ణాటక భూమికి యోగాతో విడదీయరాని అనుబంధం ఉందని ప్రధాని గుర్తు చేశారు. ఈ గడ్డపై ఎంతోమంది గొప్ప యోగా గురువులు, పండితులు జన్మించారని కొనియాడారు. ఇదే వేదికగా కన్నడ చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ దిగ్గజ నటుడు, కన్నడ రత్న డాక్టర్ రాజ్‌కుమార్‌ను ప్రధాని ప్రత్యేకంగా స్మరించుకున్నారు. దివంగత నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ నిత్యం యోగా సాధన చేసేవారని, ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ఈ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ డిజిటల్ మాధ్యమం ద్వారా పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బెంగళూరులోని క్యాంపస్‌లో సరికొత్తగా నిర్మించ తలపెట్టిన 'గోల్డెన్ జూబ్లీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్' నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో ఏర్పాటు చేయనున్న నూతన ఎస్-వ్యాస ఆఫ్-క్యాంపస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. యోగా విద్యను మరింత విస్తృతం చేయడానికి, దేశవిదేశాల్లో దానికి శాస్త్రీయ గుర్తింపు తీసుకురావడానికి ఇలాంటి సంస్థలు చేస్తున్న కృషి ఎంతైనా అభినందనీయమని ప్రధాని ప్రశంసించారు.

303 ప్రాజెక్టులు..రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు

ముఖ్యంగా రిలయన్స్ సంస్థ రూ. 2.43 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలతో ఒప్పందం చేసుకోగా, కియా సంస్థ ఏడాదికి అదనంగా మరో 2 లక్షల కార్ల తయారీ కోసం రూ. 19000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు.ఈ సదస్సులో రెండోరోజు కూడా వివిధ రంగాల పారిశ్రామికవేత్తలతో సమావేశాలలో మంత్రి నారా లోకేష్ పెట్టుబడుల ప్రతిపాదనలపై చర్చించారు. ఆయన సమక్షంలో 24 కంపెనీలు రూ.1,05,634 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్నాయి. ఏరోస్పేస్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, హెల్త్‌కేర్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో దాదాపు 75,055 ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని అంచనా వేశారు.

5 రోజుల్లోనే అనుమతులు జారీ

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నాలా యాక్ట్‌ను రద్దు చేశామని చెప్పారు. కేవలం 13 లైసెన్సుల ద్వారా 5 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. ఆటోమేటిక్ అప్రూవల్స్, సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాలను తీసుకువచ్చామని, పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపుల కోసం నిన్నటి నుంచే ఎస్క్రో ఖాతా అమల్లోకి వచ్చిందన్నారు. పారిశ్రామిక సంస్కరణల్లో ఎస్క్రో ఖాతా ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందని, పెట్టుబడుల రక్షణ కోసం త్వరలోనే 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను కూడా తీసుకురానున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. 2024 నుంచి వచ్చిన 714 ప్రతిపాదనల్లో 522 ప్రతిపాదనలు వాస్తవ రూపంలోకి వస్తున్నాయని తెలిపారు.

భవిష్యత్తులో వన్ ఫ్యామిలీ.. వన్ ఏఐ

భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, 'వన్ ఫ్యామిలీ - వన్ ఏఐ' విధానం ద్వారా ప్రతి కుటుంబం నుంచి నిపుణులను తయారు చేస్తామన్నారు.
తాను గతంలో ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని తెలుగువారిని ప్రపంచ నిపుణులుగా నిలిపినట్లే ఇప్పుడు ఏఐలోనూ ముందుంటామని సీఎం చంద్రబాబు అన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో దేశ లక్ష్యం 500 గిగావాట్లు కాగా, ఆంధ్రప్రదేశ్ ఒక్కటే 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుందని, ప్రతి ఇంటిపైనా సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో విజయనగరం జిల్లాలో భోగాపురం విమానాశ్రయం పూర్తి చేసుకోవడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ, సౌత్ కోస్టల్ రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులను సాకారం చేసుకున్నామని పేర్కొన్నారు.

నా ఫోన్‌ను మోదీ ట్యాప్ చేస్తున్నారు

తన ఫోన్‌లోనే ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చకు రావాలన్న సవాలును రాహుల్ మరోసారి పునరుద్ఘాటించారు. ఆ చర్చకు మోదీ వస్తే ఎవరు విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకి? అన్న విషయాలు బయటపడతాయని అన్నారు. చర్చ జరిగితే ప్రధాని రాజకీయ జీవితం ముగిసిపోతుందని వ్యాఖ్యానించారు. తాను ప్రసంగాల రూపంలో సాగే చర్చను కోరుకోవడం లేదని, ఇద్దరి మధ్య నేరుగా చర్చ జరగాలని స్పష్టం చేశారు.పార్లమెంటులో చర్చకు ప్రయత్నించినా తన మైక్ నిలిపివేస్తున్నారని, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని రాహుల్ ఆరోపించారు. రైతు చట్టాలు, ఓట్ల చోరీ, ఎస్ఐఆర్, చైనా తదితర అంశాలపై తనకు మాట్లాడే అవకాశం రాలేదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో చర్చకు రావాలంటూ చేసిన సవాలుపై స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని తన ఏసీ గది నుంచి బయటకు వచ్చి సామాన్యులు పీల్చే గాలిని పీల్చాలని రాహుల్ అన్నారు. తనపై మోదీ గతంలో మాదిరిగా విమర్శలు చేయడం లేదని, ఆచితూచి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం ఆయన మనసులో ఉన్న భయమేనని రాహుల్ వ్యాఖ్యానించారు.

హరీశ్ నీళ్ల,నిధుల దొంగ మాత్రమే కాదు బొగ్గు దొంగ కూడా

సాగర్, నిమ్స్ తదితర అంశాలపై మాజీమంత్రి హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని సంచలన ఆరోపణలు చేశారు.

మల్లన్నసాగర్ నిర్మాణంపై ప్రశ్నలు

మల్లన్నసాగర్ రిజర్వాయర్ సిస్మిక్ జోన్‌లో ఉందని నిర్మాణానికి ముందు ఎన్‌జీఆర్ఐ హెచ్చరించినప్పటికీ అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు పట్టించుకోలేదని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. రిజర్వాయర్ నిర్మాణంలో లోపాలు, లీకేజీలు బయటపడకుండా ఉండేందుకే హైదరాబాద్ తాగునీటి ప్రాజెక్టు కోసం జరుగుతున్న బ్లాస్టింగ్స్ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. రూ.6 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టును రూ.9 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. నిర్వాసితులకు సరైన పరిహారం అందించలేదని, కొండపోచమ్మ సాగర్ నుంచి మల్లన్నసాగర్‌కు నీటి తరలింపు పనుల్లో డిజైన్లు మార్చి రూ.1,700 కోట్ల అదనపు వ్యయానికి కారణమయ్యారని మాజీమంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు.

నిమ్స్‌లో రూ.100 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణ

ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో హరీశ్ రావు నిమ్స్ ఆసుపత్రిలో రూ.100 కోట్ల అవినీతికి పాల్పడ్డారని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. ఆసుపత్రి ఉద్యోగుల నుంచి తనకు ఆధారాలు అందాయని, గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండానే రూ.25 కోట్లను ఇతర ఖాతాలకు మళ్లించారని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారానికి సంబంధించిన సమావేశాల మినిట్స్, ఇతర వివరాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమ్స్ వ్యవహారంపై విచారణకు ఆదేశించాలని టీఆర్ఎస్ చీఫ్ కవిత డిమాండ్ చేశారు.

కొండపోచమ్మ సాగర్‌లోనూ అక్రమాల ఆరోపణలు

కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులో టన్నెల్ నిర్మాణం స్థానంలో కాలువ నిర్మాణం చేపట్టి రూ.1,700 కోట్ల అదనపు వ్యయం చేశారని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. ఈ వ్యవహారంలో అప్పటి ఈఎన్‌సీ మురళీధర్‌తో పాటు ఇద్దరు ఇంజనీర్లపై కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. అవినీతికి పాల్పడిన ఏజెన్సీల నుంచి సొమ్ము రికవరీ చేయాలని విజిలెన్స్ నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదని టీఆర్ఎస్ చీఫ్ కవిత విమర్శించారు.

బొగ్గు, భూముల వ్యవహారాలపై విమర్శలు

సిద్దిపేటలోనూ హరీశ్ రావు అవినీతి సామ్రాజ్యాన్ని నిర్మించారని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. బొగ్గు డంపింగ్ యార్డుల పేరుతో అనుమతులు తీసుకుని, మహారాష్ట్ర నుంచి బొగ్గు తెస్తామని చెప్పి సింగరేణి నుంచి అక్రమంగా సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేటలో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేలా పట్టణం వెలుపలకు తరలించారని, వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల విషయంలోనూ అక్రమాలు జరిగాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత విమర్శలు గుప్పించారు.

అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలి

తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది అమరులైతే వారిలో 600 కుటుంబాలకే సాయం అందించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారి ఆస్తులు వందల కోట్లకు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. హరీశ్ రావు 2004, 2023 ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్న ఆస్తుల వివరాల మధ్య వ్యత్యాసాలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను అడిగిన ప్రశ్నలకు హరీశ్ రావు సమాధానం చెప్పాలని, మౌనంగా ఉంటే ప్రజలే మౌనంగా బుద్ధి చెబుతారని టీఆర్ఎస్ చీఫ్ కవిత ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ అవినీతిలో తనకు సంబంధం లేదు

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కుటుంబంలో సభ్యురాలిగా ఉన్నప్పటికీ, ఆ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిలో తనకు పైసా భాగస్వామ్యం లేదని టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు. తనకు లేదా కుటుంబ సభ్యులకు కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఒక్క ఎకరం భూమి కూడా లేదని తెలిపారు. తన ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే అదనంగా ఏదైనా ఉన్నట్లు నిరూపిస్తే ప్రభుత్వానికి రాసిస్తానని టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు.

అధికారంలోకి వస్తే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్ష ఎకరాలకే నీరు అందుతోందని టీఆర్ఎస్ చీఫ్ కవిత పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు ఉచిత విద్య, మెరుగైన ఉచిత వైద్యాన్ని అందిస్తామని తెలిపారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రధాన అంశాలను ప్రాధాన్యతగా తీసుకున్నామని చెప్పారు. సిద్దిపేటలో మున్సిపల్ ఎన్నికల నుంచే తమ రాజకీయ పోరాటం ప్రారంభమవుతుందని, ప్రజలు తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని టీఆర్ఎస్ చీఫ్ కవిత కోరారు.

పార్టీ కార్యాలయానికి భూమిపూజ

అంతకుముందు సిద్దిపేటకు చేరుకున్న కవితకు పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. తొలుత కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగధాంపల్లి చౌరస్తాలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం జానుల్లా షా దర్గాలో చాదర్ సమర్పించారు.

ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరింది. పొరుగు దేశమైన పాకిస్థాన్‌లోని లాహోర్ నగరాన్ని సైతం దాటేసి, ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మొదటి స్థానంలో నిలిచింది. నగరవ్యాప్తంగా దట్టమైన విష పొగమంచు (స్మాగ్) అలుముకోవడంతో గాలి నాణ్యత తీవ్రంగా క్షీణించి ప్రజలు శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సంస్థ 'ఐక్యూఎయిర్' తాజా లెక్కల ప్రకారం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 334గా నమోదైంది. దీనిని 'హజార్డస్' (ప్రమాదకర) విభాగంగా వర్గీకరించారు.

మరోవైపు భారత ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం ఈ రీడింగ్ మరింత తీవ్రంగా 403గా రికార్డైంది. పరిస్థితులు అత్యంత 'తీవ్రమైనవి'గా సీపీసీబీ పేర్కొంది. ఈ రెండు సంస్థలు అనుసరించే గణన పద్ధతులు, కొలమానాలు వేర్వేరుగా ఉండటం వల్లే రీడింగ్స్‌లో ఈ వ్యత్యాసం కనిపిస్తుంది. సాధారణంగా ఏక్యూఐ 50 లోపు ఉంటేనే గాలి నాణ్యత ఆరోగ్యకరమైనదిగా భావిస్తారు. ప్రస్తుత రీడింగ్స్‌ను పరిశీలిస్తే ఢిల్లీ గాలి ఎంత ప్రమాదకరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.దాదాపు రెండు కోట్ల మందికి పైగా జనాభా ఉన్న దేశ రాజధాని ప్రాంతం ప్రస్తుతం దట్టమైన పొగమంచు ముసుగులో చిక్కుకుంది. రహదారులపై దృశ్యమానత (విజిబిలిటీ) గణనీయంగా పడిపోయింది.

ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లపై వెళ్లే కార్లు, బైకులు ఆ దట్టమైన పొగమంచులోంచి అతి కష్టంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధాన రహదారులపై ఉండే వీధి దీపాలు కూడా కనిపించనంతగా మంచు కమ్మేసింది. ఈ పరిస్థితిని అదుపు చేసేందుకు అధికార యంత్రాంగం నగరంలోని కీలక ప్రాంతాలలో మిస్ట్ స్ప్రేయింగ్ యంత్రాలను మోహరించింది. రోడ్లపై గాల్లోకి నీటిని పిచికారీ చేస్తూ దుమ్ము, ధూళిని తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. ఉత్తర భారతదేశంతో పాటు పాకిస్థాన్‌లో శీతాకాలం ప్రారంభంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తడం ప్రతీ ఏటా సాధారణమైపోయింది. చల్లటి, బరువైన శీతాకాలపు గాలులు నేలమట్టానికి సమీపంలోనే ఉండిపోతాయి. దీనివల్ల వాహనాల నుంచి వెలువడే పొగ, నిర్మాణ రంగం నుంచి వచ్చే దుమ్ము, పొలాల్లో పంట వ్యర్థాలను (స్టబుల్ బర్నింగ్) తగులబెట్టడం వల్ల వచ్చే పొగ పైకి వెళ్లకుండా వాతావరణంలోనే చిక్కుకుపోతున్నాయి. ఫలితంగా నగరంలో గాలి పీల్చడం ప్రమాదకరంగా మారి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రైలులో బాంబ్ ఉందని బెదిరించాడు

రాయ్‌పూర్ , నవంబర్ 13:ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ రైల్వే స్టేషన్‌లో విచిత్రమైన ఘటన జరిగింది. కోర్బా నుంచి యశ్వంత్‌పూర్ జంక్షన్‌కు వెన్‌గంగా ఎక్స్‌ప్రెస్ రైలు వెళుతోంది. గురువారం మధ్యాహ్నం సమయంలో రాజ్‌నంద్‌గావ్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది.

అప్పుడు ఓ ప్రయాణికుడు లోకోపైలట్ దగ్గరకు వెళ్లి.. రైలులో బాంబ్ ఉందని సమాచారమిచ్చాడు. పది నిమిషాల్లోనే పేలనుందని చెప్పి.. తన లగేజీని అక్కడే వదిలేసి పారిపోయాడు, లోకోపైలట్ వెంటనే అప్రమత్తమై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి.. రైలులో తనిఖీలు చేపట్టాయి. ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో.. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తనిఖీల నేపథ్యంలో గంటన్నర ఆలస్యంగా.. ఆ రైలు తిరిగి బయలుదేరింది. తరువాత సదరు ప్యాసింజర్ తన లగేజీ కోసం స్టేషన్‌కు తిరిగి రాగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

భాగ్యనగరంలో భారత్ సమ్మిట్-2026 షురూ

చర్చనీయాంశాలుగా నిలిచాయి.

ప్రపంచ సమస్యలపై అంతర్జాతీయ వేదిక

'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న రాజకీయ, ఆర్థిక పరిణామాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, అంతర్జాతీయ సహకారం, కృత్రిమ మేధ (ఏఐ), వాతావరణ మార్పులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు సాగుతున్నాయి. వివిధ దేశాలకు చెందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, మాజీ ప్రధానులు, మాజీ మంత్రులు, గవర్నర్లు, ఎంపీలు, రాయబారులు, విధాన నిర్ణేతలు, మేధావులు, సామాజికవేత్తలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా 'తెలంగాణ రైజింగ్' పేరుతో చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పట్టణీకరణ.. ఫ్యూచర్ సిటీపై మంతనాలు

తొలిరోజు జరిగిన మొదటి ప్యానల్ చర్చ పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై కొనసాగింది. ఈ చర్చలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పట్టణాల అభివృద్ధి, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన, ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ వంటి అంశాలపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను మంత్రి వివరించారు.

ఆర్థిక, సామాజిక న్యాయంపై చర్చలు

రెండో ప్యానల్ చర్చ 'ఆర్థిక న్యాయం' అంశంపై జరిగింది. ఇందులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సమాజంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను తగ్గించడం, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందించడం, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మూడో ప్యానల్ చర్చలో 'సామాజిక న్యాయం' అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం అమలు తీరు, బీసీలతో పాటు వెనుకబడిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించాల్సిన ఆవశ్యకతపై చర్చ సాగింది. నాలుగో ప్యానల్ చర్చ 'సంక్షేమం' అంశంపై నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఇందులో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

నేడు రాహుల్‌గాంధీ రాక

భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి రావాల్సిన ప్రతినిధుల్లో కొందరు చివరి నిమిషంలో హాజరుకాలేకపోవడం నిర్వాహకుల్లో కొంత ఆందోళన కలిగించింది. కాగా, రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా మరో నాలుగు కీలక అంశాలపై 'తెలంగాణ రైజింగ్' చర్చలు జరగనున్నాయి. సహకార సమాఖ్యవాదం, సంస్కృతి-సమాజం, యువత-క్రీడలు-రాజకీయాలు, ఎన్నికల సమగ్రత అంశాలు చర్చకు రానున్నాయి. అంతర్జాతీయ ప్రతినిధులు ఆయా రంగాల్లో తమ అనుభవాలు, అభిప్రాయాలను పంచుకోనున్నారు. రెండో రోజు కార్యక్రమాలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొననున్నారు.

రెండో రోజు సైతం ఏపీకి పెట్టుబడుల వెల్లువ

కల్పిస్తామని ఈ ఇన్ ఫ్రా సంస్థలు ఒప్పందంలో పేర్కొన్నాయి. ఐటీసీ, హీరోమోటార్స్ కార్పొరేషన్ సంస్థలు ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములుగా మారుతూ ఒప్పందం చేసుకున్నాయి.మరోవైపు, పునరుత్పాదక ఇంధన రంగంలో 'గ్రీన్ జెన్ రెన్యూవబుల్ ఎనర్జీ' సంస్థ రూ. 8 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, పునరుత్పాదక విద్యుత్ రంగంలోనే 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' రూ. 6.60 వేల కోట్ల పెట్టుబడికి ముందుకు వచ్చింది. అంతరిక్ష మరియు ఏరోస్పేస్ రంగాల్లోనూ రాష్ట్రానికి కీలక పెట్టుబడులు దక్కాయి. 'అగ్నికుల్ కాస్మోస్' సంస్థ రూ. 510 కోట్ల పెట్టుబడితో 350 మందికి ఉద్యోగాలు కల్పించనుండగా, ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగంలో 'హాథోర్ రాకెట్ ప్రైవేట్ లిమిటెడ్' రూ. 250 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. అమరావతిలో ఒబెరాయ్ గ్రూప్ (ఈఐహెచ్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఫైవ్ స్టార్ లగ్జరీ హోటల్ ఏర్పాటుకు కీలక ఒప్పందం కుదిరింది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో సీఎం చంద్రబాబు సమక్షంలో సీఆర్‌డీఏ అధికారులు, ఒబెరాయ్ ప్రతినిధుల మధ్య ఈ ఎంఓయూ జరిగింది. రూ.174 కోట్ల పెట్టుబడితో నిర్మించే ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి యువతకు 150 ప్రత్యక్ష, 250 పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సీనియర్ జర్నలిస్ట్ పాల్కీ శర్మ నిర్వహించిన 'ఫైర్ సైడ్ చాట్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తాను చేపట్టిన కీలక ఆర్థిక, సాంకేతిక సంస్కరణలను వివరించారు. భవిష్యత్ అంతా ఐటీ రంగానిదే ఉంటుందని ఆనాడే ముందుచూపుతో అంచనా వేసి, ఆ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చానని చంద్రబాబు తెలిపారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు ప్రారంభించేలా ఆ సంస్థ వ్యవస్థాపకులు బిల్ గేట్స్‌ను తాను ఎలా ఒప్పించారో ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. భారతదేశంలో గణితం (మ్యాథ్స్), ఆంగ్ల (ఇంగ్లీష్) సబ్జెక్టులలో మంచి ప్రావీణ్యం కలిగిన విద్యార్థులు పుష్కలంగా ఉన్నారని, ఇది ఐటీ రంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని నాడు బిల్ గేట్స్‌కు వివరించినట్లు తెలిపారు. ఐటీ రంగానికి అవసరమైన మానవ వనరులను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెచ్చేందుకు ఆనాడు ఇంజనీరింగ్ కాలేజీలకు విరివిగా అనుమతులు ఇచ్చామని పేర్కొన్నారు. తాను ఐటీ రంగానికి ప్రాధాన్యతనిస్తుంటే అప్పటి ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించేవని, అయినప్పటికీ వెనకడుగు వేయకుండా ముందుకు సాగానని చెప్పారు. కేవలం ఐటీ సంస్కరణలే కాకుండా, దేశంలోనే తొలిసారిగా విద్యుత్ సంస్కరణలను కూడా తానే తీసుకువచ్చానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ఆటో కార్మికులకుఇందిరమ్మ ఇళ్లు

- ఆటోరిక్షా కార్మికుల కోసం రూ.220 కోట్లతో 2 వేల ఇళ్లు

- ఇందిరమ్మ ఇళ్లు-టవర్ల తరహాలోనే 'ఆటో నగర్ కాలనీ'

- తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ ప్రతిపాదనకు ప్రభుత్వ అనుమతి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. నిత్యం రోడ్లపై ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ జీవనం సాగించే ఆటో కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా 'ఆటోనగర్ కాలనీలు' ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొలి విడతలో 2 వేల ఎల్ఐజీ ఫ్లాట్లను నిర్మించనుంది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.220 కోట్లు ఖర్చు చేయనుండగా ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. బండ్లగూడ, గంధంగూడ, పేట్ బషీర్‌బాగ్, జల్‌పల్లి లక్ష్మీగూడ ప్రాంతాలను ఇందుకోసం ఎంపిక చేశారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ కాలనీలను నిర్మించనున్నారు.

ఒక్కో ప్రాంతంలో 500 చొప్పున మొత్తం 2 వేల ఫ్లాట్లు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ప్రత్యేకంగా ఇళ్లను కేటాయించడం ద్వారా నగరంలో అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు ఊరట కలగనుంది.హైదరాబాద్ మహా నగరంలో ఆటో నడుపుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోవడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో సొంత ఇల్లు సమకూరితే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంది. ఈ ఆటోనగర్ కాలనీలకు సంబంధించి రేవంత్ రెడ్డి సర్కార్ కీలక స్పష్టత ఇచ్చింది. ఇప్పటికే క్యూర్ పరిధిలో అల్పాదాయ కుటుంబాల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్ల పథకానికి సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, కేటాయింపు ప్రక్రియే ఆటోనగర్ కాలనీలకు కూడా వర్తించనున్నాయని తేల్చి చెప్పింది. అంటే లబ్ధిదారుల ఎంపిక, ఫ్లాట్ల కేటాయింపు తదితర అంశాలు ఆ పథకం నిబంధనల ప్రకారమే కొనసాగనున్నాయి.

అర్హులైన ఆటో డ్రైవర్లను గుర్తించి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. అయితే ఈ ఆటో డ్రైవర్ల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల తుది జాబితా, ఫ్లాట్ల నిర్మాణం పూర్తయ్యే గడువు వంటి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.మరోవైపు రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపడుతోంది. ఇటీవల ఆటో ఛార్జీలను కూడా సవరించింది. మొదటి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీని రూ.30గా నిర్ణయించగా ఆ తర్వాత ప్రతి అదనపు కిలోమీటర్‌కు రూ.14 వసూలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. వెయిటింగ్ ఛార్జీ నిమిషానికి 75 పైసలుగా నిర్ణయించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు సాధారణ ఛార్జీపై 1.5 రెట్లు అదనపు ఛార్జీ వర్తించనుంది. ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయం అమలైతే హైదరాబాద్‌లోని వేలాది ఆటో కార్మిక కుటుంబాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. తొలి విడతలో 2 వేల కుటుంబాలకు సొంతింటి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు ఆటో కార్మికుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

బలహీన పడుతున్న బంధాలు,


భారమవుతున్న బంధుత్వాలు

- మనుషుల మధ్య పెరుగుతున్న దూరం.. మనసుల మధ్య తగ్గుతున్న ఆప్యాయత

- అవసరానికి పలకరింపులు.. ఆస్తుల కోసం ఆరాటాలు.. ఆత్మీయతకు దూరమవుతున్న కుటుంబాలు

- ఒకే ఇంట్లో ఉన్నా పలకరింపులేని పరిస్థితి.. పండుగలకే పరిమితమవుతున్న బంధాలు

ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న



ఒకప్పుడు కుటుంబం అంటే ఆప్యాయతలకు నిలయం. బంధువులంటే కష్టసుఖాల్లో తోడుగా నిలిచే ఆత్మీయులు. ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంధుమిత్రుల సందడి కనిపించేది. కష్టమొస్తే కుటుంబ సభ్యులు, బంధువులు ఒకరికొకరు అండగా నిలిచేవారు. పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు అందరినీ ఒకచోట చేర్చేవి. కానీ నేటి సమాజంలో ఆ పరిస్థితులు క్రమంగా మారిపోతున్నాయి. మనుషులు పెరుగుతున్నారు.. పరిచయాలు పెరుగుతున్నాయి.. ఫోన్లలో వందలాది నంబర్లు ఉంటున్నాయి. కానీ మనసుకు దగ్గరగా ఉండే మనుషుల సంఖ్య మాత్రం తగ్గిపోతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

అవసరమున్నప్పుడే గుర్తొస్తున్న బంధాలు

నేటి సమాజంలో కొందరి మధ్య బంధాలు ఆప్యాయతల కంటే అవసరాల చుట్టూనే తిరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పని ఉన్నప్పుడు ఫోన్ చేయడం, అవసరం తీరిపోయాక పలకరింపులు తగ్గించడం సాధారణంగా మారుతోంది. ఒకప్పుడు రోజూ కలుసుకునే బంధువులు సైతం ఇప్పుడు నెలల తరబడి మాట్లాడుకోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. కష్టాల్లో ఉన్నప్పుడు పలకరించే వారు కొందరే ఉంటుండగా, సంతోష సమయాల్లో మాత్రం చుట్టూ జనాలు చేరడం కనిపిస్తోంది. దీంతో నిజమైన ఆప్యాయతకు, అవసరాల కోసం ఏర్పడే పరిచయాలకు మధ్య తేడా స్పష్టమవుతోంది.

ఆస్తుల ముందు ఆత్మీయతలు చిన్నబోతున్నాయా.?

కుటుంబాల్లో ఆస్తులు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తి పంపకాలు, వారసత్వ హక్కుల విషయంలో తలెత్తుతున్న వివాదాలు రక్తసంబంధాల మధ్య కూడా చిచ్చు పెడుతున్నాయి. చిన్న చిన్న అపార్థాలు పెద్ద గొడవలుగా మారుతున్నాయి. అన్నదమ్ముల మధ్య మాటలు తగ్గిపోతున్నాయి. అక్కాచెల్లెళ్ల మధ్య ఆత్మీయతలు దూరమవుతున్నాయి.

ఒకే కుటుంబానికి చెందినవారు సైతం ఒకరినొకరు దూరం చేసుకుంటున్నారు. ఆస్తులు సంపాదించుకోవడంలో చూపుతున్న శ్రద్ధను బంధాలను కాపాడుకోవడంలో చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒకే ఇంట్లో ఉన్నా.. ఎవరి ప్రపంచం వారిదే

సాంకేతిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ కుటుంబ సభ్యుల మధ్య ప్రత్యక్ష సంభాషణ తగ్గడానికి కూడా ఒక కారణమవుతోంది. ఒకే ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లలోనే మునిగిపోతున్నారు. పక్కనే ఉన్న మనిషితో మాట్లాడటానికి సమయం ఉండదు కానీ దూరంగా ఉన్నవారితో సోషల్ మీడియాలో గంటల తరబడి సంభాషించే పరిస్థితి కనిపిస్తోంది. కుటుంబ సభ్యులంతా ఒకచోట కూర్చున్నా మనసులు మాత్రం వేర్వేరు ప్రపంచాల్లో విహరిస్తున్నాయి.

వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు తోడెవరు.?

పిల్లల భవిష్యత్తు కోసం జీవితమంతా కష్టపడిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్న ఘటనలు సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్నతనంలో పిల్లల ప్రతి అవసరాన్ని తీర్చిన తల్లిదండ్రులకు వయసు మీద పడిన తర్వాత కొంత సమయం కేటాయించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతల పేరుతో దూరంగా ఉంటున్న పిల్లలు కొందరు కనీసం రోజూ ఫోన్ చేసి మాట్లాడటానికీ సమయం కేటాయించడం లేదు. వృద్ధులకు కావాల్సింది పెద్ద ఆస్తులు, ఖరీదైన బహుమతులు కాదు.. తమవారు దగ్గరుండి పలకరించే నాలుగు మాటలు, చూపించే చిన్నపాటి ప్రేమ మాత్రమే.

పండుగలకే పరిమితమవుతున్న పలకరింపులు

ఒకప్పుడు పండుగలు అంటే కుటుంబ సభ్యులు, బంధువుల కలయికకు ప్రత్యేక సందర్భాలు. ఊరంతా కలిసి పండుగ జరుపుకునే వాతావరణం ఉండేది. ఇప్పుడు చాలామంది బంధువుల పలకరింపులు వాట్సాప్ శుభాకాంక్షలు, ఫోన్ కాల్స్‌కే పరిమితమవుతున్నాయి.

లఒకే ఊరిలో నివసిస్తున్నా నెలల తరబడి కలుసుకోని పరిస్థితులు ఉన్నాయి. పుట్టినరోజులు, పెళ్లిరోజులు గుర్తుంచుకుని సోషల్ మీడియాలో శుభాకాంక్షలు చెప్పడం పెరిగినా, కష్టసమయాల్లో నేరుగా వెళ్లి పలకరించే ఆప్యాయత మాత్రం తగ్గుతోందనే భావన వ్యక్తమవుతోంది.

అహంకారం, అపార్థాలు.. విడిపోతున్న కుటుంబాలు

కుటుంబ సంబంధాలు దెబ్బతినడానికి కేవలం ఆర్థిక పరిస్థితులే కారణం కాదు. చిన్న చిన్న అపార్థాలు, అనవసరమైన అనుమానాలు, ఇతరులతో పోల్చుకోవడం, అహంకారం, మాట పట్టింపులు కూడా బంధాలను బలహీనపరుస్తున్నాయి. తప్పు ఎవరిదనే చర్చలోనే కాలం గడిచిపోతోంది కానీ సమస్యను పరిష్కరించుకోవాలనే ఆలోచన కొరవడుతోంది. ఒక అడుగు ముందుకు వేసి మాట్లాడితే పరిష్కారమయ్యే సమస్యలు కూడా సంవత్సరాల తరబడి దూరాలకు కారణమవుతున్నాయి.

బంధాలు తెగిపోతే తిరిగి అతికించడం అంత సులభం కాదు

డబ్బు పోతే మళ్లీ సంపాదించుకోవచ్చు. ఆస్తి పోతే తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ మనసు విరిగిన తర్వాత, నమ్మకం కోల్పోయిన తర్వాత పాత ఆప్యాయతలను తిరిగి పొందడం అంత సులభం కాదు. మనిషి జీవితంలో నిజమైన సంపద బంగారం, భూములు, బ్యాంకు నిల్వలు మాత్రమే కాదు. కష్టంలో పలకరించే మనుషులు, బాధలో ఓదార్చే కుటుంబ సభ్యులు, అవసరంలో అండగా నిలిచే బంధువులే అసలైన సంపద.

మారాల్సింది సమాజమా.? మన ఆలోచనా విధానమా.?

బంధాలు బలహీనపడుతున్నాయని సమాజాన్ని నిందించడం కంటే ప్రతి ఒక్కరూ తమ కుటుంబం నుంచి మార్పును ప్రారంభించాల్సిన అవసరం ఉంది. రోజులో కొంత సమయం కుటుంబ సభ్యులతో గడపాలి. తల్లిదండ్రులను తరచూ పలకరించాలి. బంధువుల కష్టసుఖాలను తెలుసుకోవాలి. చిన్న చిన్న మనస్పర్థలను పెద్దవిగా చేసుకోకుండా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. అవసరం ఉన్నప్పుడే కాకుండా ఎలాంటి అవసరం లేకపోయినా ఆప్యాయంగా పలకరించే అలవాటు పెంచుకోవాలి.నేటి సమాజం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. సాంకేతికంగా ఎదుగుతోంది. ఆర్థికంగా బలపడుతోంది. కానీ ఈ ప్రయాణంలో మనిషికి మనిషికి మధ్య ఉండాల్సిన అనుబంధాలు కనుమరుగవ్వకూడదు. మనం సంపాదించే డబ్బు మనకు సౌకర్యాలను ఇవ్వవచ్చు.. కానీ ఆప్యాయతను కొనివ్వలేదు. పెద్ద పెద్ద ఇళ్లు నిర్మించుకోవచ్చు.. కానీ వాటిలో ప్రేమ, పలకరింపులు లేకపోతే అవి కేవలం గోడల మధ్య నివాసాలుగానే మిగిలిపోతాయి.బంధాలు అనేవి రక్తంతో ఏర్పడతాయి.. కానీ నిలిచేది మాత్రం ప్రేమతోనే. బంధుత్వాలు పేరుకు ఉండటం కాదు.. అవసరమైనప్పుడు అండగా నిలవడమే నిజమైన బంధుత్వం. మనిషి బతికున్నప్పుడు పలకరించండి, కష్టంలో ఉన్నప్పుడు తోడుగా నిలవండి, ఎందుకంటే కోల్పోయిన ఆస్తిని తిరిగి సంపాదించవచ్చు కానీ కోల్పోయిన ఆత్మీయతను తిరిగి పొందడం చాలా కష్టం

ఇంద్రకీలాద్రి అమ్మవారికి
బంగారు హారం కానుక

- భక్తితో 38.700 గ్రాముల స్వర్ణాభరణం సమర్పించిన ముంబై భక్తుడు

- దాతకు అమ్మవారి దర్శనం.. వేద పండితుల ఆశీర్వచనం, ప్రసాదాల అందజేత



ఇంద్రకీలాద్రి (ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మవారిపై భక్తులు తమకున్న అపార భక్తిప్రపత్తులను కానుకల రూపంలో చాటుకుంటున్నారు. ఈ క్రమంలో ముంబైకి చెందిన ఓ భక్తుడు అమ్మవారికి బంగారు హారాన్ని సమర్పించి తన భక్తిని చాటుకున్నారు.ముంబైలోని చెంబూరు ప్రాంతానికి చెందిన జి.వి. వంశీకృష్ణ శుక్రవారం (నవంబరు 13) అమ్మవారికి 38.700 గ్రాముల బరువున్న ఒక బంగారు హారాన్ని కానుకగా అందజేశారు.

అధికారిక రసీదు అందజేత

దాత సమర్పించిన బంగారు హారాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు కానుకకు సంబంధించిన అధికారిక రసీదును దాతకు అందించారు. అనంతరం దాతకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు.

వేద పండితుల ఆశీర్వచనం

దర్శనం అనంతరం వేద పండితులు దాతకు ఆశీర్వచనం అందించారు. దేవస్థానం తరఫున అమ్మవారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేసి గౌరవించారు. అమ్మవారిపై భక్తితో స్వర్ణాభరణాన్ని సమర్పించడం పట్ల ఆలయ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

బకాయిలు పెట్టింది మీరే..
చెల్లిస్తున్న మాపై నిందలా?

- జగన్‌పై లోకేశ్ ఫైర్



అమరావతి (ప్రశ్న న్యూస్) చిత్తూరులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటన రాజకీయ దుమారం రేపింది. ఈ ఘటనకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలే కారణమంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన ఆరోపణలపై మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. జగన్ హయాంలోనే రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, తమ ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో రూ.5 వేల కోట్లు చెల్లించిందని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇరువురు నేతలు 'ఎక్స్' వేదికగా పరస్పరం విమర్శలు చేసుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల బకాయిలు చెల్లించకపోవడం వల్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగన్ ఆరోపించారు. చిత్తూరు ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి పెంచుతున్న కళాశాలల యాజమాన్యాలను ప్రభుత్వం నియంత్రించాలని కోరారు. ఫీజులు చెల్లించకపోతే పరీక్షలు రాయనివ్వబోమని, సర్టిఫికెట్లు ఇవ్వబోమని కళాశాలలు హెచ్చరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఒత్తిళ్లతో కొందరు చదువులు మానేసి పనులకు వెళ్తుండగా, మరికొందరు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని విమర్శించారు.దీనిపై లోకేశ్ స్పందిస్తూ సొంత బాబాయి హత్య నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వరకు జగన్ వ్యవహారశైలి ఒక్కటేనని విమర్శించారు. తప్పు చేసి, నిందను ఇతరులపై నెట్టి, అబద్ధాలతో తప్పించుకోవడమే ఆయన పద్ధతని మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యం విద్యార్థుల భవిష్యత్తుకు ఇచ్చి ఉంటే రూ.4 వేల కోట్ల బకాయిలు మిగిలేవి కావని వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని, తమ ప్రభుత్వం గత రెండున్నరేళ్లలోనే రూ.5 వేల కోట్లు చెల్లించిందని లోకేశ్ తెలిపారు. ప్రస్తుతం ప్రతినెలా క్రమపద్ధతిలో నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. బకాయిలు చెల్లిస్తున్న తమ ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. ఫేక్ ప్రచారంతో వాస్తవాలను మార్చలేరని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న జగన్ చరిత్రను చెరిపేయలేరని విమర్శించారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నాన్ని కూడా స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు.

రూ.20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ
భవన నిర్మాణం

- పంచాయతీ భవన నిర్మాణానికి శ్రీకారం

- రూ.20 లక్షల వీబీజీరాంజీ నిధులతో నిర్మాణ పనులు

- స్లాబ్ పనులను ప్రారంభించిన సర్పంచ్ జిన్నా రామచంద్రారెడ్డి



కాల్వ శ్రీరాంపూర్ (ప్రశ్న న్యూస్): పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం వీబీజీరాంజీ పథకం ద్వారా ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన భవన నిర్మాణ పనుల్లో భాగంగా తాజాగా స్లాబ్ వేసే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జిన్నా రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పంచాయతీ భవన స్లాబ్ పనులు చేపట్టారు. గ్రామానికి సొంతంగా సౌకర్యవంతమైన పంచాయతీ భవనం అందుబాటులోకి రానుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన భవనం పూర్తయితే గ్రామపంచాయతీ పరిపాలనా కార్యకలాపాలతో పాటు ప్రజలకు అవసరమైన సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంధ్య వేణుతో పాటు పలువురు గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌లో
నీటి సంక్షోభం

తగ్గితే సైబరాబాద్ పరిధిలోని 3.5 లక్షలకు పైగా గృహ, వాణిజ్య నీటి కనెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందనే భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ ప్రాంతాలపై తీవ్ర ప్రభావం!

ముఖ్యంగా ఐటీ హబ్‌గా పేరొందిన శేరిలింగంపల్లి నియోజకవర్గంతో పాటు గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, నానక్‌రామ్‌గూడ, లింగంపల్లి, చందానగర్, మియాపూర్, మదీనాగూడ, బీరంగూడ, రామచంద్రాపురం, పటాన్‌చెరు ప్రాంతాల్లో నీటి సరఫరా సమస్యలు తలెత్తవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, ప్రగతినగర్, మూసాపేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, షేక్‌పేట ప్రాంతాలపైనా ప్రభావం ఉండొచ్చని చెబుతున్నారు.

ట్యాంకర్లకు డిమాండ్.. భారీగా భారం!

నీటి సరఫరా తగ్గితే అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు ప్రైవేట్ ట్యాంకర్లే దిక్కు కానున్నాయి. ఇప్పటికే పలు హైరైజ్ భవనాల్లో నీటిని పొదుపు చేసేందుకు స్విమ్మింగ్ పూల్స్, ఫౌంటెన్లను మూసివేస్తున్నారు.

గార్డెన్లకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల కోసం వారానికి రూ.లక్షల ఖర్చు చేయాల్సి వస్తుండటంతో నివాసితులపై నిర్వహణ భారం పెరుగుతోంది. ట్యాంకర్ల ధరలు పెరగడంతో పాటు బుకింగ్ చేసినా రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి రావచ్చనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఐటీ కంపెనీలకూ తప్పని తిప్పలు.?

సైబరాబాద్‌లోని భారీ ఐటీ భవనాల్లో సెంట్రల్ ఏసీ వ్యవస్థల నిర్వహణకు కూడా పెద్ద మొత్తంలో నీరు అవసరం అవుతుంది. నీటి కొరత తీవ్రమైతే కూలింగ్ వ్యవస్థల నిర్వహణ కష్టతరం అవుతుంది. దీంతో కొన్ని ఐటీ సంస్థలు ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ హైబ్రిడ్ విధానాన్ని అమలు చేసే అవకాశాలనూ పరిశీలించవచ్చనే చర్చ జరుగుతోంది.

42 రోజుల నీటి నిల్వలే.. ప్రత్యామ్నాయాలపై దృష్టి!

మరోవైపు.. సింగూరు, మంజీరా జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీరు మరో 42 రోజులకు మాత్రమే సరిపోవచ్చనే అంచనాలు ఇప్పుడు నగరవాసుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను హైదరాబాద్‌కు మళ్లించడంతోపాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి అదనపు నీటిని వినియోగించే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయ నీటి సరఫరాపై పూర్తి స్థాయి కార్యాచరణ ఇంకా వెల్లడించాల్సి ఉంది. జనవరి నుంచి నీటి కోతలు అమలైతే సైబరాబాద్ ప్రజలకు గడ్డుకాలం తప్పకపోవచ్చనే ఆందోళన వ్యక్తం అవుతున్నాయి.

హైదరాబాద్ సీపీగా
మహేశ్ భగవత్ బాధ్యతలు స్వీకరణ

- పదేపదే నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరిక



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేశ్ భగవత్ బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ కమిషనరేట్ లోని తన ఛాంబర్ లో సంబంధిత ఫైళ్లపై సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం నూతన సీపీ మహేశ్ భగవత్ మీడియాతో మాట్లాడుతూ తమ ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. "హైదరాబాద్‌లో శాంతి భద్రతలు, మహిళా భద్రత, ట్రాఫిక్ వంటివి కీలక అంశాలు. ప్రతి ఏటా 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. అందుకే ఈ అంశాలకు మేము ప్రాధాన్యమిస్తాం. మరోవైపు భూమి విలువ పెరగడం వల్ల భూ తగాదాల్లో దాడులు జరుగుతున్నాయి. వీటిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. నగరంలో పదేపదే నేరాలకు పాల్పడే అలవాటున్న నేరగాళ్లపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లో సైబర్ నేరాల కట్టడి, డయల్ 100, 112 ఎమర్జెన్సీ సేవల బలోపేతం, విజిబుల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆర్థిక భద్రతను కల్పిస్తుంది

జిల్లా కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కల్పించడమే ముఖ్య ఉద్దేశం అని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటన లో తెలిపారుఈ పథకాన్ని ఈనెల 19న ప్రారంభించనున్నారని కుటుంబంలో సంపాదించే వ్యక్తి 18 నుండి 59 సంవత్సరాల వయస్సు గలవారు బీమా పొందేందుకు అర్హులని తెలిపారు వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డులో నమోదు చేయబడిన పుట్టిన తేదీని పరిగణలోకి తీసుకుంటారని జిల్లా కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు.ఈ పథకం కింద సభ్యుడు మరణించినట్లయితే అతని కుటుంబానికి ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయల బీమా మొత్తం చెల్లించబడుతుందని ఈ పథకం కింద నమోదు చేసుకోవడానికి కుటుంబ పెద్ద వివరాలు మరియు నామినీ వివరాలు నమోదు చేయవలసి ఉంటుందని తెలిపారు.బీమాదారులను నమోదు చేయడానికి గ్రామం, వార్డు స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడతాయని,డేటా సేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత డిజిటల్ డేటా సంతకం చేసిన దరఖాస్తు పత్రాల స్కాన్ చేసిన కాపీలను బీమా కంపెనీతో పంచుకుంటారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

క్లెయిమ్ ప్రాసెసింగ్ విధానం

గ్రామీణ ప్రాంతాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మరణ వివరాలను సేకరించి వెబ్ పోర్టల్ ద్వారా అప్లోడ్ చేసి ఎంపిడిఓకి పంపుతారని ఎంపిడిఓ క్లెయిమ్ ప్రామాణికతను పరిశీలించి చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కు పంపుతారని జిల్లా కలెక్టర్ తెలిపారు.సిపిఓ డిఆర్డిఓ పరిశీలన తర్వాత ఆమోదం కోసం జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తారని జిల్లా కలెక్టర్ క్లెయిమ్ ను ఆమోదించి తుది సెటిల్మెంట్ కోసం బీమా కంపెనీకి పంపుతారని బీమా కంపెనీ క్లెయిమ్ ను ప్రాసెస్ చేసి 5 లక్షల రూపాయలను నామినీలకు బదిలీ చేస్తుందని పేర్కొన్నారుపట్టణ ప్రాంతాలలో మున్సిపాలిటీలలో వార్డు ఆఫీసర్ ప్రారంభించి మున్సిపల్ కమిషనర్ పరిశీలించి సిపిఓ పిడి మెప్మా పరిశీలించి జిల్లా కలెక్టర్ ఆమోదించి బీమా కంపెనీకి పంపుతారని మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు ఆఫీసర్ ప్రారంభించి డిప్యూటీ కమిషనర్ పరిశీలించి మున్సిపల్ కమిషనర్ ఆమోదించి బీమా కంపెనీకి పంపుతారని వివరించారు.

చంద్రగిరి టీడీపీకి మరో షాక్

- ఎర్రావారిపాలెంలో పసుపు శిబిరానికి గుడ్‌బై.. వైఎస్సార్‌సీపీలోకి ముఖ్య నేతలు.
- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు మార్పు
- పంచాయతీ ఎన్నికల వేళ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న చేరికలు



ఎర్రావారిపాలెం(ప్రశ్న న్యూస్) చంద్రగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. ఎర్రావారిపాలెం మండలం వీఆర్ అగ్రహారం పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ ముఖ్య నేతలు పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం ఈ చేరికలు చోటుచేసుకున్నాయి.వీఆర్ అగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడిన నాయకులు తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి చేరుకుని ఆయనతో సమావేశమయ్యారు. గతంలో చెవిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రాధాన్యమిచ్చారని వారు పేర్కొన్నారు. అలాంటి పాలనను తిరిగి చూడాలనే ఆకాంక్షతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు.

టీడీపీకి రాజీనామా చేసిన వారిలో..

సి.కృష్ణమూర్తి, సి.నవీన్, కె.భాను, ఎం.తరుణ్, వై.విజయ్, కె.రెడ్డెప్పతో పాటు పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కొత్తగా చేరిన నాయకులకు చెవిరెడ్డి సూచించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతుతో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థి విజయానికి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పంచాయతీ ఎన్నికల వేళ చేరికలు

చంద్రగిరి నియోజకవర్గంలో గ్రామస్థాయి రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వీఆర్ అగ్రహారంలో టీడీపీకి చెందిన నేతలు వైఎస్సార్‌సీపీలో చేరడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చేరికలు స్థానికంగా పార్టీ బలాబలాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో చెల్లెలు మృతి

– అక్కకు తీవ్ర గాయాలు

విశాఖపట్నం శుక్రవారం ఉదయం మధురవాడ లా-కాలేజ్ కూడలి వద్ద విషాదం చోటుచేసుకుంది. గోవాడకు స్కూటీపై వెళ్తున్న అక్కాచెల్లెళ్లు ప్రయాణిస్తున్న వాహనం డివైడర్ను ఢీకొనడంతో అమృత వర్షిని (21) అక్కడికక్కడే మృతి చెందింది
. అక్క ఆదిత్య హర్షిణి స్వల్ప గాయాలతో బయటపడింది. తండ్రి అనారోగ్యంతో ఇంటి వద్దే ఉండటంతో ఇద్దరే ప్రయాణమయ్యారు. ఘటనపై పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాప్తాడు ఘటన

కుదుట పడుతున్న బాలిక ఆరోగ్యం

బెంగళూరు అనంతపురం జిల్లా, రాప్తాడు దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోందని మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం బెంగళూరులో చికిత్స పొందుతున్న బాధితురాలు, వైద్య సిబ్బంది సహాయంతో నడక సాధన చేస్తోందని, ఫిజియోథెరపీ చికిత్స కొనసాగుతోందని చెప్పారు. ముఖంపై కుట్లు తొలగించామని, ఆమె స్వయంగా ఆహారం తీసుకుంటూ, శ్వాస తీసుకుంటుందని వివరించారు. రాత్రి సమయాల్లో మాత్రమే ఆక్సిజన్ సాయం అందిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారని మంత్రులు స్పష్టం చేశారు.

నాణ్యమైన ఇళ్ల నిర్మాణమే లక్ష్యం, బిల్డర్లకు ప్రభుత్వం అండ

రియల్ ఎస్టేట్ రంగానికి సంస్కరణల బాట

పెట్టుబడులతో యువతకు ఉపాధి అవకాశాలు

కొనుగోలుదారులకు అందుబాటు ధరల్లో గృహాలు

నిర్మించాలి -- మంత్రి పొంగూరు నారాయణ

విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, ఆర్థిక ప్రగతికి బాటలు వేయడమే ప్రభుత్వ లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నిర్మాణ రంగం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూరుతుందని పేర్కొన్నారు. అయితే కేవలం వ్యాపార లాభాలకే పరిమితం కాకుండా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన గృహాలు నిర్మించడంపై బిల్డర్లు, డెవలపర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.విశాఖపట్నంలోని గాదిరాజు ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న నరేడ్కో ప్రాపర్టీ షో--2026కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాపర్టీ షోలో ఏర్పాటు చేసిన వివిధ రియల్ ఎస్టేట్ సంస్థల స్టాళ్లను పరిశీలించి, నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులు, ప్రాజెక్టుల వివరాలను తెలుసుకున్నారు.

బిల్డర్లకు ప్రభుత్వ సహకారం..

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. బిల్డర్లు, డెవలపర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నరేడ్కో సభ్యులకు ఏవైనా సమస్యలు లేదా సహాయం అవసరమైనా నేరుగా తనను సంప్రదించవచ్చని సూచించారు.రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెరిగితే నిర్మాణ కార్యకలాపాలు విస్తరిస్తాయని, తద్వారా అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. నిర్మాణ నాణ్యత, కొనుగోలుదారుల ప్రయోజనాలు, అందుబాటు ధరలు వంటి అంశాలకు బిల్డర్లు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి కోరారు.

రియల్ ఎస్టేట్‌కు ఊతం.. ఆర్థిక ప్రగతికి బాటలు..

రియల్ ఎస్టేట్ రంగం కేవలం భవన నిర్మాణాలకే పరిమితం కాదని, సిమెంట్, స్టీల్, విద్యుత్, రవాణా, కార్మిక రంగాలతో పాటు అనేక అనుబంధ పరిశ్రమలకు ఊతమిస్తుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ రంగానికి ప్రోత్సాహం అందిస్తూ, కొనుగోలుదారుల నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యతా ప్రమాణాలు పాటించడం కీలకమని మంత్రి వ్యాఖ్యలు



స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విస్తరణ, పట్టణాభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగాల మధ్య సమన్వయంతో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా మంత్రి వివరించారు.

నాగుల చవితి వేళ.. ఇంద్రకీలాద్రిపై నాగదేవతకు విశేష పూజలు

- కార్తీక మాసంలో ఆధ్యాత్మిక శోభ, మల్లేశ్వరాలయంలో సహస్ర లింగార్చన
-ఆకాశదీపం, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవతో భక్తి పారవశ్యం
- పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ,
ఈవో శీనా నాయక్ దంపతులు



ఇంద్రకీలాద్రి (ప్రశ్న న్యూస్) కార్తీక మాసం.. నాగుల చవితి పర్వదినం, ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నాగుల చవితిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. మరోవైపు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

నాగపుట్ట వద్ద శాస్త్రోక్త పూజలు

నాగుల చవితి సందర్భంగా ఇంద్రకీలాద్రిపై శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ సమీపంలోని నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ వైదిక కార్యక్రమాలు చేపట్టారు. దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తమ ధర్మపత్నులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నాగపుట్ట వద్ద సర్పాలకు పాలను సమర్పించి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

మల్లేశ్వరాలయంలో కార్తీక వైభవం


కార్తీక మాసం సందర్భంగా శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవలను వైభవంగా నిర్వహించారు. దీపాల వెలుగులు, వేదమంత్రాల నడుమ ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె. శీనా నాయక్ పాల్గొన్నారు. ట్రస్టుబోర్డు సభ్యులు రాఘవరాజు, ఎ. శ్రీనివాసరావు, సరిత, పద్మావతి ఠాకూర్, జి.వి. నాగేశ్వరరావు, కళావతి, ప్రత్యేక ఆహ్వానితులు వి. శంకరబాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, దేవస్థానం సిబ్బంది కార్యక్రమాలను సమన్వయం చేశారు.

సర్పంచ్ ఎన్నికలపై టీడీపీ గురి

నంద్యాల, గోస్పాడు నేతలతో మంత్రి ఫరూక్ కీలక భేటీ

గ్రామాల వారీగా రాజకీయ పరిస్థితులపై సమీక్ష..

గెలుపు వ్యూహాలపై దిశానిర్దేశం



నంద్యాల(ప్రశ్న న్యూస్) రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, సర్పంచ్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా నంద్యాల, గోస్పాడు మండలాలపై మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రత్యేక దృష్టి సారించారు. రెండు మండలాల పరిధిలోని గ్రామాల ముఖ్య నాయకులతో శుక్రవారం నంద్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై నాయకులతో ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి, స్థానిక రాజకీయ సమీకరణాలు, నాయకులు, కార్యకర్తల పనితీరుపై సమీక్షించారు.

సమన్వయంతో ముందుకు సాగాలి..

ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మంత్రి నాయకులకు దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకుని విజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు.

గ్రామాలపై ప్రత్యేక దృష్టి..

నంద్యాల, గోస్పాడు మండలాల్లోని అన్ని గ్రామాల్లో పార్టీ బలాబలాలను అంచనా వేస్తూ ఎన్నికల కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు ఈ సమావేశం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతరిక్ష రంగానికి ఏపీని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

స్పేస్ ఎకానమీ ఎకోసిస్టమ్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

సీఐఐ సదస్సులో మంత్రి నారా లోకేష్ వెల్లడి



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) అంతరిక్ష పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్‌ను నూతన గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. అంతరిక్ష రంగానికి సంబంధించిన విడిభాగాల తయారీ సంస్థలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు, పెట్టుబడిదారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సమగ్ర స్పేస్ ఎకానమీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు 'కక్ష్య నుంచి అవకాశాల దిశగా: భారతదేశ నూతన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ' అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొన్నారు. బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ సీఈవో, సీటీవో రోహన్ గణపతి మోడరేటర్‌గా వ్యవహరించారు.

విడిభాగాల తయారీ సంస్థలకు ప్రోత్సాహం..

కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా నియంత్రించే అంతరిక్ష రంగంలో రాష్ట్రాల పాత్ర కూడా కీలకమని లోకేష్ పేర్కొన్నారు. ఒక పారిశ్రామిక రంగాన్ని ఎంపిక చేసుకుని, దానికి అవసరమైన సంస్థలు, భాగస్వాములను గుర్తించి, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా పారిశ్రామిక వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చన్నారు. వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ విధానాలతో పరిశ్రమలను అనుసంధానిస్తామని చెప్పారు. స్కైరూట్ వంటి సంస్థలకు అవసరమైన రాకెట్ విడిభాగాలు, ఉపవ్యవస్థలను తయారుచేసే అనుబంధ పరిశ్రమలను రాష్ట్రంలోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.

పరిశోధనలకు పెద్దపీట..

అంతరిక్ష రంగం అభివృద్ధిలో విద్యాసంస్థలు, పరిశ్రమల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని మంత్రి అభిప్రాయపడ్డారు. అకడమిక్ కరిక్యులమ్‌ను ఆధునీకరించడం, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ద్వారా పరీక్షలు, ధ్రువీకరణ సదుపాయాలను కల్పించడం అవసరమన్నారు. ఇప్పటికే ఇంధన రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఐఐటీ తిరుపతితో కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు.

స్పేస్ సిటీకి సమగ్ర విధానం..

దేశంలో స్పేస్ సిటీల అభివృద్ధికి అనుసంధానమైన సమగ్ర విధానం రావాల్సిన అవసరం ఉందని లోకేష్ పేర్కొన్నారు. అంతరిక్ష పరిశ్రమలు, విడిభాగాల తయారీదారులు, సరఫరాదారులను ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలని సూచించారు. ఈ రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. రాకెట్లకు అవసరమైన షీల్డ్స్ తయారు చేస్తున్న ఎంఎస్ఎంఈ సంస్థలను ఉదాహరణగా ప్రస్తావించారు.ఈ చర్చలో ఇస్రోకు చెందిన ఎయిర్ కమోడోర్ ప్రశాంతి బి.నాయర్, అగ్నికుల్ కో-ఫౌండర్, సీఈవో శ్రీనాథ్ రవిచంద్రన్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, గెలాక్సీ ఐ ఫౌండర్, సీఈవో సుయాష్ సింగ్, స్కైరూట్ ఏరోస్పేస్ కో-ఫౌండర్, సీటీవో డాకా నాగ భరత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టడీ సర్కిల్‌కు మహర్దశ

పెమ్మసాని చొరవతో రూ.4 కోట్ల నిధులు మంజూరు

రెండో అంతస్తు నిర్మాణానికి ప్రభుత్వ పరిపాలనా అనుమతులు



గుంటూరు(ప్రశ్న న్యూస్) పేద విద్యార్థుల ఉన్నత విద్య, పోటీ పరీక్షల కలలకు మరింత బలాన్ని చేకూర్చే దిశగా గుంటూరులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్-కమ్-స్టడీ సర్కిల్ అభివృద్ధికి మార్గం సుగమమైంది. కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో స్టడీ సర్కిల్‌లో అదనపు వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు జారీ చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సాంఘిక సంక్షేమ శాఖ బడ్జెట్‌లో అందుబాటులో ఉన్న నిధుల నుంచి ఈ మొత్తాన్ని కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

రెండో అంతస్తుతో రూపురేఖలు మార్పు..

గుంటూరులోని అంబేద్కర్ భవన్-కమ్-స్టడీ సర్కిల్‌లో రెండో అంతస్తు నిర్మాణంతో పాటు విద్యార్థులకు అవసరమైన ఆధునిక సదుపాయాలను కల్పించనున్నారు. విశాలమైన లైబ్రరీ హాల్, విద్యుత్ సౌకర్యాలు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్య వసతులు, ఆధునిక ఫర్నిచర్ ఏర్పాటు చేయనున్నారు. పది మంది ప్రయాణించే సామర్థ్యం కలిగిన లిఫ్ట్‌తో పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా 50 కేవీఏ సామర్థ్యం గల డీజిల్ జనరేటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు మెరుగైన అధ్యయన వాతావరణం అందుబాటులోకి రానుంది.

ఆరేళ్లుగా మరుగునపడ్డ ప్రాజెక్టుకు మళ్లీ ఊపిరి..

వాస్తవానికి 2019 ఎన్నికలకు ముందే అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ స్టడీ సర్కిల్ అభివృద్ధి కోసం రూ.6.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదని, దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని కూటమి వర్గాలు పేర్కొంటున్నాయి. ఫలితంగా పేద విద్యార్థులకు ఉపయోగపడాల్సిన కీలక విద్యా వనరు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. తాజాగా పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో రూ.4 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు రావడంతో ప్రాజెక్టుకు మళ్లీ కదలిక వచ్చింది.

'న్యాయ ప్రతిభా పురస్కారం - 2026' ఎంపికైన
న్యాయమూర్తి పూస మానస గంగపుత్ర

- నేడు మానస సహా మరో ఇద్దరు న్యాయమూర్తులకు సత్కారం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఖమ్మం సీపీ సునీల్ దత్
- నవభారత యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో వేడుక



ఖమ్మం (తేజవ్యాస్ బెస్త , స్టేట్ బ్యూరో చీఫ్) ఖమ్మం నగరంలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో యువ న్యాయమూర్తులకు ఘనంగా సన్మాన కార్యక్రమం జరగనుంది. ఇటీవలే జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన ముగ్గురు ప్రతిభావంతులైన యువ న్యాయమూర్తులను ఘనంగా సత్కరించేందుకు నవభారత యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో 'న్యాయ ప్రతిభా పురస్కారం – 2026' పేరిట ఇవాళ ప్రత్యేక సన్మాన సభను నిర్వహిస్తున్నారు.

- ముఖ్య అతిథిగా ఖమ్మం సీపీ సునీల్ దత్ :

నేడు శనివారం , నవంబర్ 14న సాయంత్రం 6:30 గంటలకు జరగనున్న ఈ సన్మాన సభకి ముఖ్య అతిథిగా ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్ విచ్చేసి యువ న్యాయమూర్తులను సత్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన కుమారి పూస మానస గంగపుత్ర, శ్రీమతి కరంగి దేవ హనీషా, శ్రీ ముత్యాలగారి వెంకట బి. సాయి నరసింహ హనుమలకు పురస్కారాలను అందజేసి అభినందనలు తెలియజేయనున్నారు. సమాజంలో న్యాయవ్యవస్థ పట్ల యువతకు ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ విశిష్ట వేడుకకు న్యాయవాద మిత్రులు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నవభారత యువ చైతన్య సమితి అధ్యక్షులు, ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి యార్లగడ్డ రాఘవ రావు కోరారు.

జాతీయ సమగ్రత, దేశ భద్రత బీజేపీతోనే సాధ్యం: వెంకటేష్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ భద్రత, సార్వభౌమాధికారం, జాతీయ సమగ్రతకు భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని, వ్యక్తి కంటే పార్టీ ముఖ్యం, పార్టీ కంటే దేశం ముఖ్యం అనే నినాదంతో ముందుకు సాగుతు ప్రపంచ దేశాల్లోనే భారతదేశం అన్ని రంగాల్లో అత్యున్నత స్థానంలో నిలిచేలా పాలన అందిస్తుందని తెలంగాణ బీజేపి బీసీ సెల్ నేషనల్ కన్వీనర్ పి. వెంకటేష్ అన్నారు. శుక్రవారం నాడు న్యూడిల్లీ లోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో పంజాబ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కార్యదర్శి. జై ప్రకాష్. జెపి. ఎన్ సేవక్‌త్రీ, ని మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు తెలంగాణలో బీజేపి పట్ల ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పెంచేలా తన వంతు ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ పుంజుకొని వచ్చే ఎన్నికలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. బీజేపి సిద్ధాంతాలకు ఆకర్షితుడైన తాను విద్యార్థి దశ నుండే పార్టీ కోసం పనిచేసానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతం కోసం నిర్విరామంగా పనిచేస్తున్న తన కృషి గుర్తించి త్వరలో జరగబోతున్న పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీకాళహస్తిలో మున్సిపల్ ఎన్నికల నగారా.రేపటి నుంచే నామినేషన్ల స్వీకరణ

44 వార్డులకు ఎన్నికల సందడి..

నామినేషన్ల కోసం ఐదు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు తాజా షెడ్యూల్ విడుదల చేయడంతో శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో ఎన్నికల సందడి ప్రారంభమైంది. ప్రభుత్వ అనుమతితో నవంబర్ 14వ తేదీ శనివారం నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుందని మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి వెల్లడించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ పదవితో పాటు పట్టణంలోని 44 వార్డుల కౌన్సిలర్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు మున్సిపల్ పరిధిలో ఐదు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ఇలా.నవంబర్ 14 నుంచి 16 వరకు: ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ.

నవంబర్ 17: ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన.

నవంబర్ 19: మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించి ఎన్నికల గుర్తులు కేటాయించనున్నారు.నామినేషన్ రుసుము, ఎన్నికల వ్యయ పరిమితి.ఎన్నికల ప్రచార వ్యయ పరిమితిని చైర్‌పర్సన్ అభ్యర్థులకు గరిష్ఠంగా రూ.20 లక్షలు, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులకు రూ.7.50 లక్షలుగా నిర్ణయించినట్లు కమిషనర్ వివరించారు.పట్టణంలో 72,648 మంది ఓటర్లు.శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో మొత్తం 72,648 మంది ఓటర్లు ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. వీరిలో 34,939 మంది పురుషులు, 37,741 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పకుండా పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు. అలాగే ఓటర్లందరూ ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

ఎస్ బి ఐ ఏ టి యం చోరీ కేసును ఛేదించిన ఎల్లారెడ్డిపేట పోలీసులు

పలు రాష్ట్రాల్లో ఏటీఎంలే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) సినీ ఫక్కీలో చోరీ చేసి ఏకంగా ఏటీఎంనే ఎత్తుకెళ్లి జిల్లా అంతా కలియతిరిగి అక్కపల్లి అడవిలో ఏటీఎం పగలగొట్టి ఎటువంటి క్లూ దొరకకుండా పెట్రోల్ పోసి చాకచక్యంగా తప్పించుకున్న అంతర్రాష్ట్ర ఏటీఎం చోరీ ముఠా ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలోవివరాలు వెల్లడించిన సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి. ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూతేదీ 11.04.2026 తెల్లవారుజామున ఎల్లారెడ్డిపేటలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలో ఉన్న ఎస్బిఐ ఎటిఎం లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి, ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.6,06,100 నగదును చోరీ చేయడంతో పాటు ఏటీఎం యంత్రాన్ని సైతం ఎత్తుకెళ్లారు.ఈఘటనపై హిటాచీ పేమెంట్స్ సర్వీసెస్ కంపెనీ ఛానల్ మేనేజర్ దాడిగల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాడం జరిగింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక మరియు ఇతర శాస్త్రీయ ఆధారాల ఆధారంగా నిందితులను రాజస్థాన్ కి.చెందిన ఏ1.బహదూర్ చౌకీదార్ ప్రతబరామ్ బవారీ , ఏ2. గోపాల్ తేజారామ్ బవారీ లుగా గుర్తించి వారిని అదుపులోకి అరెస్ట్ చేసి విచారించగా గతంలో రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో పలు ఏటీఎం చోరీలకు పాల్పడినట్లు విచారణలో తెలాగా నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం రూ.9.50 లక్షల
విలువైన గంజాయి దహనం

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు



జగిత్యాల(ప్రశ్న న్యూస్)జగిత్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 47 కేసులకు సంబంధించి నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సుమారు 19 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినరేషన్ (దహనం) ప్రక్రియ ద్వారా దహనం చేసిన గంజాయి విలువ సుమారు రూ.9.50 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ గారు తెలిపారు.ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనల ప్రకారం, పర్యావరణ కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను పాటిస్తూ ఈ గంజాయిని దహనం చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్‌గా జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ వ్యవహరించగా, కమిటీ సభ్యులుగా అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వేణు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కొందరు అక్రమ సంపాదనే లక్ష్యంగా గంజాయి సాగు, విక్రయాలు, రవాణాకు పాల్పడుతూ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తున్నారని అన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేసే ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని తెలిపారు.ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా, నిబంధనలకు విరుద్ధంగా కలిగి ఉన్నా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన బాసుపల్లి రాం రెడ్డి

- తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని

వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూరు--కిష్టాపూర్ డివిజన్ పూడూరుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాసుపల్లి రాంరెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెల 3వ తేదీన తన కుమార్తె క్రాంతి రెడ్డి వివాహం జరగనున్న నేపథ్యంలో వివాహ ఆహ్వాన పత్రికను కేటీఆర్‌కు అందజేసి వివాహ వేడుకకు హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్,మాజీ వార్డు సభ్యుడు రేగు నగేశ్, బీఆర్ఎస్ నాయకుడు నిమ్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు
పాల్పడితే జైలు శిక్ష

- జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డా. ఎం. జైపాల్ రెడ్డి
- -జగిత్యాల స్కానింగ్ సెంటర్లలో జిల్లా ఉప వైద్యాధికారి ఆకస్మిక తనిఖీలు



జగిత్యాల(ప్రశ్న న్యూస్)జగిత్యాల పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను బుధవారం జిల్లా ఉప వైద్యాధికారి, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం- 1994 ప్రకారం గర్భస్థ శిశువు ఆడ లేదా మగ అని నిర్ధారించి వెల్లడించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్లలో వినియోగిస్తున్న అల్ట్రాసౌండ్ యంత్రాలు, వైద్యుల అర్హత ధ్రువీకరణ పత్రాలు సంబంధిత అధికారులు మంజూరు చేసిన అనుమతులు, దరఖాస్తుల ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించారు.ప్రతి నెల 5వ తేదీలోపు ఫారం-ఎఫ్ వివరాలను సంబంధిత పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఫారం-ఎఫ్ వివరాలు, ఆఫ్‌లైన్ రికార్డుల్లోని వివరాలు ఒకే విధంగా ఉండాలని సూచించారు.అదేవిధంగా స్కానింగ్ సెంటర్లలో పేషెంట్లకు స్పష్టంగా కనిపించే విధంగా "ఇక్కడ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేయబడదు. లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోబడతాయి" అనే హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం నిబంధనలను ఉల్లంఘించి గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు పాల్పడిన వారిపై జరిమానాతో పాటు చట్టప్రకారం జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. లింగ నిర్ధారణను ప్రోత్సహించే వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వైద్యుల వైద్య రిజిస్ట్రేషన్ రద్దుకు సైతం చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన సందర్భాల్లో సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి, చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డాక్టర్ జైపాల్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి డెమో ఏనుగంటి రాజేశం, జూనియర్ అసిస్టెంట్ వి. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు, ఏడుగుళ్ల ఆలయ పరిరక్షణకు కృషి చేస్తాం

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అవసరమైతే ప్రభుత్వంతో చర్చిస్తాం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ పట్టణంలోని చారిత్రక ఏడుగుళ్ల అమ్మవారి ఆలయం, జిందా షామధార్ దర్గా మసీదును పరిరక్షించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ హామీ ఇచ్చారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఈ రెండు ప్రార్థనా మందిరాల తొలగింపునకు సంబంధించి అధికారులు జారీ చేసిన నోటీసుల నేపథ్యంలో ఆయన ఈ హామీ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.శుక్రవారం మసీదులో ప్రార్థనల అనంతరం ముస్లిం మైనారిటీలు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిరసనకారులను కలిసిన వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. మేడ్చల్ పట్టణంలో మతసామరస్యానికి ప్రతీకగా ఉన్న మసీదుతో పాటు ఏడుగుళ్ల అమ్మవారి ఆలయాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.రెండు ప్రార్థనా మందిరాల కమిటీ సభ్యులతో చర్చలు జరిపి, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించే వరకు వాటి తొలగింపును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. ప్రజల మనోభావాలను, మతపరమైన విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ఒకవేళ జాతీయ రహదారి విస్తరణ పనుల దృష్ట్యా చట్టపరంగా తొలగింపు అనివార్యమైతే, రెండు ప్రార్థనా మందిరాలకు తగిన ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి, అవసరమైన నిర్మాణాలు చేపట్టేలా ప్రభుత్వంతో మాట్లాడతానని పేర్కొన్నారు.ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, రెండు వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో ప్రజల విశ్వాసాలు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రార్థనా స్థలాల విషయంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సోమారం పాఠశాల అభివృద్ధికి
రూ.27.10 లక్షల నాబార్డ్ నిధులు



తాడ్వాయి: మండలంలోని సోమారం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి నాబార్డ్ నిధుల ద్వారా రూ.27 లక్షల 10 వేల నిధులు మంజూరు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరు చేయించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామాల అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాల నిర్మాణమే కాకుండా భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాసంస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం కూడా ముఖ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఏఎంసీ చైర్మన్లు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.సోమారం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు గ్రామ ప్రజలు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెట్టుబడుల వెల్లువ..
ఏపీకి దిగ్గజ కంపెనీల క్యూ

డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, మైనింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు భారీ ప్రోత్సాహం

పేద కుటుంబాలకు అండగా ఐటీసీ, విద్యార్థులకు చేయూతగా హీరో మోటార్స్..



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి మరో కీలక ముందడుగు పడింది. విశాఖ వేదికగా జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. రెండో రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. జేఎస్‌డబ్ల్యూ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గ్రీన్ జెన్, ఎయిర్‌ట్రంక్--జేసీకే ఇన్‌ఫ్రా, డిక్సన్ టెక్నాలజీస్, కాకినాడ సీపోర్ట్స్ తదితర సంస్థలు పెట్టుబడులకు ముందుకొచ్చాయి. మొత్తం 12 ఒప్పందాల ద్వారా రూ.1,41,585 కోట్ల పెట్టుబడులు ప్రతిపాదించగా.. 10,919 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పరిశ్రమల స్థాపనతో పాటు పేదరిక నిర్మూలన, విద్యార్థుల ఉన్నత విద్యకు తోడ్పాటునందించే పీ4 కార్యక్రమానికి కూడా కార్పొరేట్ సంస్థలు అండగా నిలవడం విశేషం.

డేటా సెంటర్లకు భారీ పెట్టుబడులు..

రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎయిర్‌ట్రంక్ ఇండియా--జేసీకే ఇన్‌ఫ్రా భారీ ప్రతిపాదనతో ముందుకొచ్చాయి. డేటా సెంటర్ క్యాంపస్‌లు, 1,400 మెగావాట్ల సామర్థ్యంతో టెలికాం కేంద్రాల ఏర్పాటుకు రూ.1,03,018 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఒప్పందంలో పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 3,120 మందికి ఉద్యోగాలు కల్పించనున్నాయి. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో డిక్సన్ టెక్నాలజీస్ రూ.700 కోట్ల పెట్టుబడితో 2,300 మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది.

మైనింగ్, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం..

ప్రకాశం జిల్లా కందుకూరులో మైనింగ్ కార్యకలాపాల కోసం జిందాల్ గ్రూప్ రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో గ్రీన్ జెన్ రెన్యూవబుల్ ఎనర్జీ రూ.8 వేల కోట్లు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ.6,600 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాయి. పారిశ్రామిక, ఇంధన రంగాల్లో రాష్ట్రాన్ని కీలక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు దోహదపడనున్నాయి.

తిరుచానూరులో అమ్మవారి
బ్రహ్మోత్సవాలకు మహా ఏర్పాట్లు

డిసెంబర్ 6 నుంచి 14 వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు

నవంబర్ 20లోగా బంగారు రథం పనులు పూర్తి చేయాలి

పంచమి తీర్థం పడి ఊరేగింపునకు 60 కళాబృందాలు..

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : జేఈఓ డా. ఎ. శరత్



తిరుపతి(ప్రశ్న న్యూస్) తిరుచానూరులో కొలువుదీరిన కలియుగ వైకుంఠాధీశుని పట్టపురాణి శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలకు టీటీడీ యంత్రాంగం సన్నద్ధమవుతోంది. అమ్మవారి బ్రహ్మోత్సవాలను డిసెంబర్ 6 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను వేగవంతం చేసింది. ముఖ్యంగా డిసెంబర్ 14న నిర్వహించనున్న పంచమి తీర్థం, తిరుమల నుంచి తిరుచానూరు వరకు జరిగే పడి ఊరేగింపును కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. సుమారు 60 కళాబృందాలతో జరిగే ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఊరేగింపు భక్తులకు కనువిందు చేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులు నిర్ణయించారు.ఈ మేరకు శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో జేఈఓ డా. ఎ. శరత్ సంబంధిత విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

నవంబర్ 20లోగా రథం పనులు పూర్తి..

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచే రథోత్సవానికి సంబంధించిన పనుల్లో జాప్యం ఉండకూడదని జేఈఓ స్పష్టం చేశారు. బంగారు రథం శుభ్రపరిచే పనులతో పాటు రథం చెక్క పనులు, పెయింటింగ్, చక్రాల ఫిట్‌నెస్ తదితర పనులను నవంబర్ 20వ తేదీలోపు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఆభరణాలు, వాహనాల శుభ్రత పనులను కూడా ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని సూచించారు.

పంచమి తీర్థం.. 60 కళాబృందాలతో పడి ఊరేగింపు..

బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన ఘట్టం పంచమి తీర్థం. ఈ సందర్భంగా తిరుమల నుంచి తిరుచానూరు వరకు నిర్వహించే పడి ఊరేగింపునకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని జేఈఓ పేర్కొన్నారు. సుమారు 60 కళాబృందాలు పాల్గొనే ఈ ఊరేగింపును వైభవంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కోమలమ్మ సత్రం నుంచి ట్రయల్ రన్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.అలిపిరి నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయం వరకు రహదారుల మరమ్మతులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని చేపట్టాలని ఆదేశించారు. ఊరేగింపు మార్గంలో మామిడి తోరణాలు, అరటి చెట్లు, పందిళ్లు, ప్లెక్సీలు, బ్యానర్లతో సంప్రదాయబద్ధంగా అలంకరణలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షలో సీఈ మనోహరం, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మల్లికార్జున ప్రసాద్, వీజీవో గిరిధర, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, గోశాల డైరెక్టర్ డా. శివకుమార్, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డా. కుసుమ కుమారి, అదనపు హెల్త్ ఆఫీసర్ డా. సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఆధ్యాత్మిక వైభవం..
భక్తిభావంతో పులకించిన పాతాళగంగ

- అంగరంగ వైభవంగా అంకాళమ్మకు విశేష పూజలు

- స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ..

- కృష్ణమ్మకు దశహారతులతో నీరాజనం





శ్రీశైలం(ప్రశ్న న్యూస్) కార్తీక మాసం వేళ శ్రీశైల క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. భక్తుల శివనామస్మరణలు, వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ క్షేత్రంలో విశేష పూజా కార్యక్రమాలు భక్తిభావాన్ని పంచుతున్నాయి. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ దేవస్థానం చేపడుతున్న ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు శ్రీశైల క్షేత్ర వైభవాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం క్షేత్ర గ్రామదేవత శ్రీ అంకాళమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, సాయంత్రం శ్రీ స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ, పాతాళగంగ వద్ద కృష్ణమ్మ హారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అంకాళమ్మకు అభిషేకాలు.. విశేష అలంకరణలు..

శ్రీశైల క్షేత్ర గ్రామదేవతగా పూజలందుకుంటున్న శ్రీ అంకాళమ్మవారికి ప్రతి శుక్రవారం దేవస్థానం తరఫున సర్కారీ సేవగా విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం మహాగణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పం పఠించారు. అనంతరం పంచామృతం, పసుపు, కుంకుమ, గంధం, పుష్పోదకం, జలంతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. విశేష అర్చనలు, కుంకుమార్చనలు, పుష్పాలంకరణలతో అమ్మవారిని భక్తిపారవశ్యంలో కొలిచారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న రహదారి చివర కుడివైపున ఉత్తరముఖంగా కొలువుదీరిన అంకాళమ్మవారు శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా విశేష ప్రాధాన్యత కలిగి ఉన్నారు. చతుర్భుజాలతో, ఆయుధాలను ధరించి భక్తులకు దర్శనమిచ్చే అమ్మవారిని ప్రకృతి శక్తి స్వరూపిణిగా భక్తులు ఆరాధిస్తారు.

స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ..

ప్రతి శుక్రవారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజుల్లో నిర్వహించే ఊయలసేవలో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీ స్వామిఅమ్మవార్లను ఊయలలో వేంచేపు చేసి షోడశోపచార పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ, సేవా సంకల్పం అనంతరం శాస్త్రోక్తంగా పూజాకైంకర్యాలు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో స్వామిఅమ్మవార్లను సర్వాంగసుందరంగా అలంకరించి పుష్పార్చనలు సమర్పించారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా ఊయలసేవ సాగింది.

పాతాళగంగలో కృష్ణమ్మకు దశహారతులు..

కార్తీక మాసోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కృష్ణమ్మ హారతి కార్యక్రమం శుక్రవారం సాయంత్రం పాతాళగంగ వద్ద భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కృష్ణవేణి నదీమతల్లి విగ్రహానికి ప్రత్యేక పూజలు, వస్త్ర సమర్పణ, సారె సమర్పణ కార్యక్రమాలు చేపట్టారు. పాతాళగంగ ఘాట్ వద్ద శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించి ఏకాదశ హారతులు సమర్పించారు. అనంతరం నదీమతల్లికి సంప్రదాయబద్ధంగా దశహారతులతో నీరాజనం పలికారు.ఓంకారం నుంచి కర్పూరం వరకు పది రకాల హారతులను సమర్పించడం ఈ కార్యక్రమంలో విశేషం. ఓంకార హారతి దర్శనంతో కష్టాలు తొలగి శుభాలు కలుగుతాయని, నాగహారతితో సర్పదోషాలు నివృత్తి అవుతాయని, త్రిశూల హారతితో అపమృత్యు భయాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. నంది, సింహ, సూర్య, చంద్ర, కుంభ, నక్షత్ర, కర్పూర హారతులకు కూడా ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, మనశ్శాంతి, ఐశ్వర్యం, కార్యసిద్ధి కలగాలని భక్తులు ఈ హారతులను దర్శించుకున్నారు.కృష్ణమ్మ హారతి సందర్భంగా నంద్యాలకు చెందిన డాక్టర్ డి. హయగ్రీవాచార్యులు ప్రత్యక్ష వ్యాఖ్యానం అందించారు. పూజా విధానాలు, హారతుల విశిష్టతను వివరిస్తూ భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తారు.

నిత్యకళారాధనలో నృత్య నీరాజనం..

మరోవైపు దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం నిత్యకళారాధనలో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన నాట్యమయూరి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ కళాకారులు సంప్రదాయ నృత్య ప్రదర్శనతో అలరించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని వేదికపై వినాయక ప్రార్థన, ఓం నమశ్శివాయ, శివాష్టకం, కాలభైరవాష్టకం, శంభో శివశంభో తదితర భక్తి గీతాలకు కళాకారులు నృత్యరూపంలో నీరాజనం సమర్పించారు.మధురిమ, హేమ, తేజ, చేతన, కృత్తిక, లావణ్య, పావని తదితరులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రాచీన భారతీయ కళలు, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు స్వామిఅమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పరిపూర్ణంగా జరగాలనే సంకల్పంతో దేవస్థానం ఈ కార్యక్రమాలను కొనసాగిస్తోంది.కృష్ణమ్మ హారతి కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యురాలు జి. లక్ష్మేశ్వరి, అర్చకస్వాములు, వేదపండితులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు
భారీ ప్రోత్సాహకాలు

- జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గణియా

నంద్యాల, నవంబరు 13: 2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌తో పాటు అన్ని వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమైన పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకం అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. 5,000 వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10,000 వరకు రూ.25 లక్షలు, 10,000కు పైగా జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఉన్న ప్రోత్సాహక మొత్తాలను ప్రభుత్వం ?



పెంచిందన్నారు.సర్పంచ్‌తో పాటు అన్ని వార్డు స్థానాలు అధికారికంగా ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించిన పంచాయతీలకే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందని తెలిపారు. ఈ నగదును గ్రామ అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకే వినియోగించాలని, నిబంధనల ప్రకారం దశలవారీగా నిధులు విడుదల చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య పనులపై కమిషనర్ తనిఖీ

- కంపోస్ట్ ప్లాంట్, 80 అడుగుల రోడ్డు పరిశీలన



నంద్యాల, నంద్యాల పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి నాణ్యతపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న పొన్నాపురంలోని కంపోస్ట్ ప్లాంట్‌తో పాటు 80 అడుగుల రోడ్డును తనిఖీ చేశారు. కంపోస్ట్ ప్లాంట్ నిర్వహణ, పారిశుద్ధ్య పనుల పురోగతిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.అనంతరం మున్సిపల్ సరఫరా చేస్తున్న తాగునీటి నమూనాలను వివిధ పరికరాల సహాయంతో పరీక్షించి నాణ్యతను పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు మురళీధర్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీమను జీరో చేసి హీరోలవుతారా?

- సంస్థలు తరలిపోతున్నా నేతల మౌనమెందుకు? బొజ్జ దశరథ రామిరెడ్డి

నంద్యాల : రాయలసీమకు దక్కాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ స్థాయి సంస్థలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నా రాజకీయ నాయకులు మౌనంగా ఉండటం దురదృష్టకరమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాలలోని సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలు, ఆధిపత్య పోరాటాలు పక్కనపెట్టి రాయలసీమ అభివృద్ధి కోసం అన్ని పార్టీల నాయకులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కర్నూలులోని మానవ హక్కుల కమిషన్ కార్యకలాపాలను ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలని, బడ్జెట్ సమావేశాలను రాయలసీమలో నిర్వహించాలని, సచివాలయ శాఖల కార్యాలయాలను రొటేషన్ పద్ధతిలో కర్నూలులో నిర్వహించాలని డిమాండ్ చేశారు.అనంతపురానికి ప్రతిపాదించిన ఎయిమ్స్, కడప ఉక్కు పరిశ్రమ, కర్నూలుకు రావాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయం, న్యాయ విశ్వవిద్యాలయం వంటి అంశాల్లో రాయలసీమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీమ వనరులు ఇతర ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగపడుతున్నా ఇక్కడ పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు.రాజకీయ నాయకులు వ్యక్తిగత దూషణలు మాని ప్రాంత ప్రయోజనాల కోసం సమష్టిగా పోరాడాలని, లేకుంటే సీమ ప్రజలు తగిన రాజకీయ గుణపాఠం చెబుతారని బొజ్జ దశరథ రామిరెడ్డి హెచ్చరించారు.

ధరల నియంత్రణ నిబంధనలు పాటించాల్సిందే

- పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన శ్రీ హర్ష



నరసరావుపేట జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) ఎం.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సంజన శ్రీహర్ష పాల్గొని రైస్ మిల్లర్లు, రిటైలర్లు, వినియోగదారుల సంఘాల ప్రతినిధుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, వినియోగదారులకు సరసమైన ధరలకు సరుకులు అందించడమే లక్ష్యంగా వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు. లీగల్ మెట్రాలజీ అధికారులు, రైస్ మిల్లర్ల మధ్య నెలకొన్న సమస్యలపై కూడా చర్చించారు. బియ్యం బస్తాలపై వాటిలో ఉన్న వాస్తవ తూకానికి అనుగుణంగానే స్టిక్కర్లు వేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. స్టిక్కర్లపై తయారీ తేదీ, ఇన్వాయిస్ వివరాలతో పాటు లీగల్ మెట్రాలజీ శాఖ సూచించిన వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. రిటైలర్లు 25 లేదా 26 కిలోల బస్తాలను విక్రయించుకోవచ్చని, అయితే బస్తాలో ఉన్న ఖచ్చితమైన బరువు స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం రకాలను ప్రకటించిన ధరల జాబితా ప్రకారమే విక్రయించాలని ఆదేశించారు. వ్యాపార నిర్వహణలో లీగల్ మెట్రాలజీ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే దశలోనే ధరలు అధికంగా ఉంటున్నాయని, దీంతో మిల్లర్లు రిటైలర్లకు అనుకూలమైన ధరలకు బియ్యం సరఫరా చేయలేకపోతున్నారని వివరించారు. ఈ పరిస్థితి రిటైల్ వ్యాపారంలో సమస్యలకు దారితీస్తోందని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వినియోగదారుల సంఘం పల్నాడు జిల్లా నాయకులు పి. యజ్ఞనారాయణ, మురికిపూడి ప్రసాద్ మాట్లాడుతూ, వినియోగదారులకు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులు అందించడం అందరి నైతిక బాధ్యతని పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనల విషయంలో ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం సమంజసం కాదని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు, రిటైలర్లు నిర్వహించే స్టాక్ రిజిస్టర్లలో నమోదైన నిల్వలకు, వాస్తవ నిల్వలకు మధ్య వ్యత్యాసాలు ఉండకూడదని పేర్కొన్నారు. రిటైలర్లందరూ ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలని కోరారు. చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం, కందిపప్పు, నూనె పంపిణీ చేసే సమయంలో స్టాక్ ఉన్నప్పటికీ అయిపోయిందని కొందరు డీలర్లు చెబుతున్నట్లు వినియోగదారుల సంఘం ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యవహారంపై డీఎస్ఓ ప్రత్యేక దృష్టి సారించాలని, విజిలెన్స్ కమిటీలను క్రియాశీలం చేసి చౌక ధరల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఈ సమావేశానికి హోల్‌సేల్ దుకాణాల యజమానులు హాజరుకాలేదు. ధరల నియంత్రణలో అన్ని వర్గాల వ్యాపారులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

నిధులు కేటాయించాలని మంత్రి శ్రీధర్ బాబుకు

వినతిపత్రం సమర్పించిన

ఆలయ చైర్మన్ గుండరాజ్



మంథని(, ప్రశ్న న్యూస్) మంథని పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన 5 ముఖ్యమైన పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శ్రీ గౌతమేశ్వర స్వామి దేవాలయ అధ్యక్షులు గుండా రాజు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గోదావరి పుష్కర ఘాటు వద్ద భారీ శివుని విగ్రహ ఏర్పాటు, మంథని గోదావరి పుష్కర ఘాటుకు కీ.శే. పాదరావు, మాజీ స్పీకర్ పేరు నామకరణం చేయుట, బోయినిపేటలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, బోయినిపేట లక్ష్మీ దేవర ఆలయానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం, బోయినిపేటలో పట్టణ దవాఖానాకు భవన నిర్మాణం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా గుండా రాజు మాట్లాడుతూ, మంథని గోదావరి పుష్కర ఘాటును ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, బోయినిపేటలో తాగునీటి, వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

మంథనిలో బీజేపీ ఓబీసీ మోర్చా
రాష్ట్ర అధ్యక్షుని జన్మదిన వేడుకలు



మంథని(ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ జన్మదిన వేడుకలను శుక్రవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల నూతనంగా నియామకమైన ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు బోయిని నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చాతరాజు రమేష్ ఆదేశాల మేరకు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా బోయిని నారాయణ మాట్లాడుతూ, మంథని నియోజకవర్గంలో బీసీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారానే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని, రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. బీజేపీ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందని, బీజేపీ ద్వారానే బీసీల అభ్యున్నతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మంథని నియోజకవర్గంలో బీసీలు అంతా బీజేపీ వెంట కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపాక సత్య ప్రకాష్, సీనియర్ నాయకులు రాపర్తి సంతోష్, మంథని నియోజకవర్గ కో-కన్వీనర్ నాంపల్లి రమేష్, ఓబీసీ మోర్చా మంథని మండల అధ్యక్షులు రేపాక శంకర్, ఓబీసీ మోర్చా మంథని పట్టణ అధ్యక్షులు గుడ్ల గురువేష్, బీజేపీ మాజీ మంథని పట్టణ అధ్యక్షులు బూడిద తిరుపతి, చిలువేరి సతీష్, బీజేపీ పట్టణ కార్యదర్శి సామల అశోక్, ఆయింటి మల్లేష్, మియాపురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం గంగపుత్ర
యువ న్యాయమూర్తులకు ఘన సన్మానం

- జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన గంగపుత్ర యువతకు సత్కారం
- న్యాయమూర్తులు గంటా మనీష్, పూస మానసలకు ఆదివారం సన్మాన సభ
- గంగాపుత్ర అడ్వకేట్స్ అసోసియేషన్, విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో వేడుక



హైదరాబాద్ (తేజవ్యాస్ బెస్త , స్టేట్ బ్యూరో)

తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికై గంగపుత్ర సామాజిక వర్గానికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన గంటా మనీష్, పూస మానసలకు ఘన సన్మానం నిర్వహించనున్నట్లు తెలంగాణ విద్యావంతుల వేదిక, ప్రకటించింది. తెలంగాణ గంగపుత్ర అడ్వకేట్స్ అసోసియేషన్ సహకారంతో గంగపుత్ర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమం జరగనుంది.

- యంగ్ జడ్జిలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం :

ప్రతిష్ఠాత్మక జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగాలకు గంటా మనీష్ , పూస మానస ఎంపికవడం యావత్ గంగపుత్ర సమాజానికి గర్వకారణమని గంగపుత్ర విద్యావంతుల వేదిక ప్రెసిడెంట్, రిటైర్డ్ ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ సర్గు సుదర్శన్ రావు కీర్తించారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ న్యాయమూర్తులుగా ఎంపికైన గంట మనీష్ , పూస మానస విజయం గంగపుత్ర భవిష్యత్ తరాలకు, యువ న్యాయవాదులకు , విద్యార్థులకు దిక్సూచిగా నిలుస్తుందని గంగాపుత్ర అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాక సజన్ కుమార్ గంగపుత్ర కొనియాడారు. న్యాయవ్యవస్థలో సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, గొప్ప కీర్తి ప్రతిష్ఠలు సొంతం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నెల నవంబర్ 15 ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకుబీసీసీఈ హాల్, ప్రగతి మహావిద్యాలయ పక్కన, హనుమాన్ వ్యాయామశాల రోడ్, కోఠిలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సత్కార సభకు గంగపుత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన న్యాయమూర్తులను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు.

గుర్రంపోడులో వాల్టా చట్టానికి తూట్లు

- ఎల్ నినో ప్రభావం.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా బోర్ల తవ్వకాలు

- అనుమతులు నిల్.. తవ్వకాలు ఫుల్!- అక్రమంగా బోర్లు వేస్తే సీజ్ చేస్తాం: గుర్రంపోడు ఎమ్మార్వో

గుర్రంపోడు (ప్రశ్న న్యూస్) భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కొత్త బోర్ల తవ్వకాలపై ఆంక్షలు విధించింది. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో భూగర్భ జలాలను పరిరక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులకు ప్రత్యేక జీవో ద్వారా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని మండల స్థాయి అధికారులకు సూచించింది. అయితే నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలో ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా అక్రమ బోర్ల తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో అధికారుల అనుమతులు లేకుండానే అర్ధరాత్రి వేళల్లో బోర్లు తవ్వడం పరిపాటిగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ సాగుతున్న ఈ వ్యవహారంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గురువారం పిట్టలగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని శ్రీ కుంచెర్ల వెంకమ్మ దేవాలయం వెనుక భాగంలో ఎలాంటి అనుమతులు లేకుండా బోరు తవ్విన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఎల్ నినో ప్రభావం, భూగర్భ జలాల కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొత్త బోర్ల తవ్వకాలపై ఆంక్షలు విధించినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు చేపట్టడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కట్ట వెంకటేశం అనే రైతు రాత్రికి రాత్రే బోరు తవ్వించి, తెల్లవారేలోపు గుట్టుచప్పుడు కాకుండా మోటారు బిగించడం విస్మయానికి గురిచేస్తోంది. కేవలం బోరు తవ్వకంతోనే ఆగకుండా మోటారు సైతం ఏర్పాటు చేయడం ప్రభుత్వ నిబంధనలకు సవాల్ విసరడమేనని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారం గ్రామంలో విస్తృతంగా చర్చకు దారితీయడంతో పాటు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



- అక్రమ బోర్లు సీజ్ చేస్తాం: ఎమ్మార్వో

పిట్టలగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో అక్రమంగా బోర్లు తవ్వుతున్నారనే సమాచారం తమకు అందిందని గుర్రంపోడు మండల ఎమ్మార్వో స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అక్రమ మార్గంలో అనుమతులు

- మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ ఏసీపి బాల శ్రీనివాస్ మాయాజాలం.?

- మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్‌లో అంతా అవినీతి దందానా.?

- గతంలో తిరస్కరించిన దరఖాస్తుకు ఇప్పుడు గ్రీన్‌సిగ్నల్ వెనుక లంచాలే కారణమా.?


- రెండు అంతస్తుల అక్రమ నిర్మాణం.. ఆపై అనుమతుల పర్వం

- మధ్యవర్తుల పైరవీలతో నిబంధనలు పక్కదారి పట్టాయా.?



మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) నిబంధనలు పాటించని సామాన్యుడి నిర్మాణంపై ఉక్కుపాదం మోపే టౌన్ ప్లానింగ్ అధికారులు పలుకుబడి, పైరవీలు ఉన్నవారి విషయంలో మాత్రం నిబంధనలకు కొత్త భాష్యం చెబుతున్నారా.? మల్కాజిగిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో తాజాగా వెలుగుచూసిన ఓ భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే నిర్మాణం కొనసాగుతున్న పాత భవనానికి స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. సెట్ బ్యాక్ లు, నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలపై గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసిన అధికారులే ఇప్పుడు అనుమతులు ఎలా జారీ చేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

గతంలో నో.. ఇప్పుడు ఎలా ఓకే.?



OFFICE OF THE MALKAJGIRI MUNICIPAL CORPORATION
BuildNow
SHORTFALL LETTER

To,

Dear Sir/Madam,

Sub: Malkajgiri Municipal Corporation – Proposed Construction of Individual Residential Building consisting of Stilt for Parking + 2 Upper Floor , to an extent of 193.57 Sq mt, situated at Plot No: HOUSE NO.10-236AND1, OLD NOS. 27-153AND8 AND 8-72AND86 ON PLOT NO. 4, , locality: VENKATESHARA NAGAR , Survey No: 707 , Village Malkajgiri , Malkajgiri Circle-5 , Malkajgiri Zone , Malkajgiri Mandal , Medchal – Malkajgiri District Shortfall Letter for misrepresentation of facts while obtaining the Building Permission under Registration/Instant Approval – Issued – Reg

Ref: 1. Provisional Building permission issued under Instant Registration / Instant approval vide no : 04683/MMC/0078/IARP/CS/2026 dated: 17/01/2026 through the BuildNow application.
2. G.O.Ms.No.168 MA&UD, DL:07-04-2012.
3. G.O.Ms.No.7 MA&UD, DL:05-01-2016.
4. G.O.Ms.No. 280 GHMC, DL:15-11-2020.
5. TGRPASS Act (Act 11 of 2020),Dt: 19-11-2020.
6. MA & UD Memo. No. 8782/plg.III/2022, Dated:20.07.2022

The Provisional permission obtained for construction of individual Residential Building vide reference 1st cited, has been examined in detail by the Post Verification team as per the rules and regulations in force. It is noticed that it has been obtained by suppressing the material facts and by misrepresentation of documents facts as stated below:

Shortfall Remarks: Line Department Triggering Checklist

1. Inspected the site and verified the document. It is observed that the applicant has not submitted link document & submitted mortgage deed and also re-verify undertaking. Hence, the submitted proposals may be suggested for shortfall.

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో ఇంటి నంబర్ 10-236/1 భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. సరైన పత్రాలు లేవని, నిబంధనలకు అనుగుణంగా సెట్ బ్యాక్ లు లేవని గతంలో ఏసీపీ బాలశ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ షార్ట్‌ఫాల్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అప్పట్లో అనుమతులను నిరాకరించిన అధికారులు. అదే స్థలానికి సంబంధించి ఇప్పుడు స్టిల్ట్ ప్లస్ అంతస్తులకు అనుమతులు మంజూరు చేయడం వెనుక కారణాలేమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.
మరోవైపు, ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణదారుడు ఇప్పటికే మూడు అంతస్తుల వరకు నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో నిబంధనలకు విరుద్ధమని గుర్తించిన నిర్మాణానికి ఇప్పుడు అనుమతులు రావడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ నడుస్తోంది. భారీగా లంచాలు తీసుకొని రెండు అంతస్తుల వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న భవనానికి అనుమతులు ఇచ్చారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యవర్తుల మాయాజాలమా.? అధికారుల దాహమా.?

సాధారణ ప్రజలు ఇంటి నిర్మాణానికి అనుమతులు కోరితే పదుల సంఖ్యలో అభ్యంతరాలు లేవనెత్తుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకునే అధికారులు. ఈ భవనం విషయంలో మాత్రం అంత



వేగంగా ఫైలు ఎలా క్లియర్ చేశారన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యవర్తుల పైరవీలు, ఆర్థిక వ్యవహారాల వల్లే అనుమతుల ప్రక్రియ వేగవంతమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దరఖాస్తులోని వివరాలకే పరిమితమై లంచాలు తీసుకొని క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించారా.? లేక నిబంధనలను పక్కనపెట్టి మరీ అనుమతులు ఎలా ఇచ్చారు అన్నది తేలాల్సి ఉంది.

ఓపెన్ ప్లాట్ అంటూ తప్పించుకునే ప్రయత్నమా.?

ఈ వ్యవహారంపై టౌన్ ప్లానింగ్ ఏసీపీ బాలశ్రీనివాస్ తప్పుడు సమాచారం ఇచ్చారని అయితే, వాస్తవంగా అక్కడ ఇప్పటికే నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిబంధనలు తుంగలో తొక్కారన్న విమర్శలు ఉన్నాయి. రిజెక్ట్ చేసిన తర్వాత కేవలం దరఖాస్తులోని వివరాల ఆధారంగా అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని స్థానికులు నిలదీస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేది ఎప్పుడు.?

గతంలో తిరస్కరించిన దరఖాస్తుకు ఇప్పుడు అనుమతులు మంజూరు కావడం, నిర్మాణ స్థితిపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలపై జీహెచ్ఎంసీ మల్కాజ్గిరి జోన్ జోనల్ కమిషనర్. ఎం ఎం సి కమిషనర్, జోనల్ సిపి. సిసిపి సమగ్ర విచారణ చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. అసలు స్థలంలో ఉన్న నిర్మాణం ఏమిటి.? దరఖాస్తు సమయంలో అధికారులు క్షేత్రస్థాయి తనిఖీ చేశారా.? సెట్బ్యాక్‌లు, భవన నిర్మాణ నిబంధనలు పాటించారా.? అనుమతుల ఫైల్లో ఏయే పత్రాలు సమర్పించారు.? గతంలో తిరస్కరించిన దరఖాస్తుకు ఇప్పుడు అనుమతులు ఎలా వచ్చాయి.? అనే అంశాలను జోనల్ కమిషనర్ బహిర్గతం చేయాలని కోరుతున్నారు.నిబంధనలు సామాన్యులకేనా.? పలుకుబడి ఉన్నవారికి, లంచాలు ఇచ్చే వారికి ప్రత్యేక మినహాయింపులా.? అన్న ప్రశ్నకు ఎంఎంసీ ఉన్నతాధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీకాళహస్తి దేవస్థానం పనితీరుపై మంత్రి ఆనం అసంతృప్తి

ఐవీఆర్ఎస్ సర్వేలో 72 శాతమే పనితీరు, 100 శాతం సంతృప్తి సాధించాలని ఆదేశం

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం పనితీరుపై రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు అందిస్తున్న సేవలపై నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో దేవస్థానానికి కేవలం 72 శాతం మాత్రమే పనితీరు నమోదు కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.శ్రీకాళహస్తి దేవస్థానాన్ని సందర్శించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముందుగా స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల పనితీరు, భక్తులకు అందుతున్న సేవలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిరోజూ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఐవీఆర్ఎస్ సర్వేలో శ్రీకాళహస్తి దేవస్థానం 72 శాతానికే పరిమితం కావడం పట్ల ముఖ్యమంత్రితో పాటు తాను కూడా అసంతృప్తిగా ఉన్నట్లు వెల్లడించారు.భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో ఎక్కడ లోపాలు ఉన్నాయో గుర్తించి వెంటనే సరిదిద్దుకోవాలని అధికారులకు సూచించారు. లోపాలు ప్రభుత్వ పాలనలో ఉన్నాయా, అధికార యంత్రాంగం పనితీరులో ఉన్నాయా, లేక పాలకమండలి సేవల్లో ఉన్నాయా అనే అంశాలను సమగ్రంగా విశ్లేషించుకోవాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో ఐవీఆర్ఎస్ సర్వేలో 100 శాతం పనితీరు



సాధించే దిశగా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, కోడ్ ముగిసిన వెంటనే రాష్ట్రస్థాయి నాయకులు, జిల్లా స్థాయి అధికార యంత్రాంగం శ్రీకాళహస్తికి చేరుకుని ఆలయ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తారని మంత్రి తెలిపారు. భక్తుల సంతృప్తి స్థాయిని 100 శాతానికి చేర్చేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు.సామాన్య భక్తులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితీరును ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేస్తూ భక్తులకు అత్యుత్తమ సేవలు అందించాలని ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

భద్రాచలంలో అక్రమ నిర్మాణాల జోరు

- ఆకాశమే హద్దుగా బహుళ అంతస్తుల నిర్మాణాలు.. ఏజెన్సీ చట్టాలకు తూట్లు
- అడిగేవారు లేరు.. అడ్డుకునేవారు లేరు.. నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారా.?
- ఏజెన్సీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు.?
- భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్లు, భూముల హక్కులపై అనేక అనుమానాలు
- సెల్లార్ల పేరుతో అదనపు అంతస్తులు.. పార్కింగ్ నిబంధనలకు తిలోదకాలు
- ఫిర్యాదులు చేసినా పూర్తిస్థాయి విచారణ ఎందుకు చేపట్టడం లేదు.?
- నోటీసులకే పరిమితమవుతున్న అధికారుల చర్యలు.. నిర్మాణాలు మాత్రం యథేచ్ఛ
- ఏజెన్సీ భూముల పరిరక్షణకు ప్రత్యేక నిఘా ఎక్కడ.?
- మరో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.?
- చట్టాలున్నాయి.. అమలు చేసేవారేరీ.?



భద్రాచలం(ప్రశ్న న్యూస్) గిరిజనుల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం ప్రత్యేక రక్షణ కల్పించిన భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో బహుళ అంతస్తుల నిర్మాణాల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ఒకవైపు ఏజెన్సీ ప్రాంత ప్రత్యేక చట్టాలు, మరోవైపు భవన నిర్మాణ నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా అంతస్తుల మీద అంతస్తులు వెలుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని నిర్మాణాలపై అనుమతులు, భూముల యాజమాన్యం, లేఅవుట్ ఆమోదాలు, సాంకేతిక అనుమతుల విషయంలో స్పష్టత కోరుతూ ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే



విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారా.?


భద్రాచలం ప్రాంతానికి వర్తించే ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియాస్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ 1959, రెగ్యులేషన్ 1/70 అత్యంత కీలకమైన చట్టాలు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల భూములు గిరిజనేతరులకు అక్రమంగా బదిలీ కాకుండా అడ్డుకోవడం, చట్టవిరుద్ధంగా బదిలీ అయిన భూములను తిరిగి స్వాధీనం చేసే విధానానికి ఇవి రక్షణ కల్పిస్తాయి. గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న భూముల యాజమాన్యంపై కూడా ఈ చట్టం కింద విచారణకు అవకాశం ఉంటుంది.అయితే భూమి బదిలీ చట్టం ఒక్కటే భవనాల అంతస్తుల సంఖ్యను నిర్ణయించదు. భూమి హక్కులు, నిర్మాణ అనుమతులు, భవన ఎత్తు, లేఅవుట్, సాంకేతిక ప్రమాణాలు అన్నింటినీ సంబంధిత చట్టాల ప్రకారం విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

గతంలో కూలిన ఐదు అంతస్తుల భవనం.. ఇద్దరు కార్మికుల మృతి..

2025 మార్చి 26న భద్రాచలం సూపర్‌బజార్ సెంటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనను ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. నిర్మాణానికి సరైన అనుమతులు లేవని, గతంలోనే ఫిర్యాదులు వచ్చినప్పటికీ పనులు కొనసాగినట్లు అప్పటి వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనపై యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంతటి విషాదం జరిగినా పట్టణంలో నిర్మాణాల పర్యవేక్షణ మరింత కఠినంగా ఎందుకు మారడం లేదన్నది ప్రజల ప్రశ్న.

భవన నిర్మాణాలకు వర్తించే నిబంధనలు ఏవి.?

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 114 ప్రకారం గ్రామపంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలకు నిబంధనల ప్రకారం అనుమతి అవసరం. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చడం, ఆమోదిత లేఅవుట్, సాంకేతిక అనుమతులు వంటి అంశాలను పరిశీలించాలి.అలాగే 2022 మార్చి 12న జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 52 ద్వారా గ్రామపంచాయతీ ప్రాంతాలకు కూడా ఉమ్మడి భవన నిర్మాణ నిబంధనలను వర్తింపజేస్తూ ఆన్‌లైన్ అనుమతుల విధానాన్ని అమలులోకి తెచ్చారు. పది మీటర్లకు మించిన ఎత్తు, 500 చదరపు మీటర్లకు మించిన స్థలాల్లోని నిర్మాణాలకు ప్రత్యేక సింగిల్ విండో విధానం



కూడా ఉంది.

హైకోర్టు ముందుకు చేరిన భద్రాచలం నిర్మాణాల వివాదం


2026లో కూడా భద్రాచలంలోని నిర్మాణ అనుమతులపై తెలంగాణ హైకోర్టులో వివాదాలు విచారణకు వచ్చాయి. మార్చి 20, 2026న జారీ చేసిన జీ+2 భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి ఏజెంట్ టు గవర్నమెంట్ ముందస్తు ఆమోదం, రెగ్యులేషన్ 1/70, పీసా చట్టం, లేఅవుట్ అనుమతుల అంశాలు న్యాయస్థానం దృష్టికి వెళ్లాయి. సెప్టెంబర్ 22, 2026న వెలువడిన అప్పీల్ ఉత్తర్వుల్లో ప్రత్యామ్నాయ చట్టపరమైన



అప్పీల్ మార్గాన్ని అనుసరించాల్సిన అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ పరిణామాలు భద్రాచలంలో నిర్మాణ అనుమతుల వ్యవహారాన్ని అధికారులు మరింత పారదర్శకంగా పరిశీలించాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.


అధికారుల బాధ్యత ఏమిటి.? తీసుకోవాల్సిన





చర్యలేమిటి.?

భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల ఆరోపణలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే జిల్లా కలెక్టర్, ఏజెంట్ టు గవర్నమెంట్, ఐటీడీఏ పీవో, పంచాయతీరాజ్, రెవెన్యూ, సర్వే, పోలీసు శాఖలు సంయుక్తంగా



ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.


1. ప్రత్యేక సర్వే: పట్టణంలోని అన్ని బహుళ అంతస్తుల భవనాలను గుర్తించి వాటి నిర్మాణ అనుమతులు, భూమి యాజమాన్య పత్రాలు, లేఅవుట్లు, భవన ప్లాన్లను పరిశీలించాలి.
2. భూముల హక్కుల పరిశీలన: రెగ్యులేషన్ 1/70 ప్రకారం భూమి బదిలీ చట్టబద్ధతను పరిశీలించి, అక్రమ బదిలీలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.
4. నిర్మాణాల నిలిపివేత: అనుమతులు లేకుండా లేదా మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే చట్టబద్ధమైన నోటీసులు జారీ చేసి, తదుపరి నిర్మాణాన్ని నిలిపివేయాలి.
5. నిర్మాణ పటిష్టత పరీక్షలు: పాత భవనాలపై అదనపు అంతస్తులు నిర్మిస్తున్న చోట్ల నిపుణుల ద్వారా స్ట్రక్చరల్ ఆడిట్ చేయించి ప్రజల ప్రాణాలకు ప్రమాదం లేకుండా చూడాలి.
6. చట్టపరమైన చర్యలు: అక్రమ నిర్మాణాలు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం జరిమానాలు, అనుమతుల రద్దు, అవసరమైన చోట కూల్చివేత చర్యలు చేపట్టాలి. అక్రమ భూమి బదిలీలపై రెగ్యులేషన్ 1/70 ప్రకారం విచారణ జరపాలి.



7. అధికారుల బాధ్యత నిర్ధారణ: ఫిర్యాదులు అందిన తర్వాత కూడా చర్యలు తీసుకోని అధికారుల పాత్రను పరిశీలించి నిర్లక్ష్యం నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

గిరిజన ప్రాంత పరిరక్షణకు ఇప్పటికైనా మేల్కొనాలి..

పీసా చట్టం 1996లోని సెక్షన్ 4 ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభలకు సంప్రదాయాలు, సాంస్కృతిక గుర్తింపు, సామాజిక వనరుల పరిరక్షణకు ప్రత్యేక అధికారాలు కల్పించారు. గిరిజనుల భూముల అన్యాక్రాంతాన్ని నిరోధించడంలో గ్రామసభలు, పంచాయతీల పాత్రను కూడా చట్టం గుర్తించింది. ఈ చట్టాల స్ఫూర్తికి అనుగుణంగా భద్రాచలంలో గిరిజన హక్కులు, ప్రజా భద్రత, ప్రణాళికాబద్ధ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి.భద్రాచలం కేవలం ఒక పట్టణం కాదు, గిరిజన సంస్కృతి, ప్రకృతి సంపద, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక. ఇక్కడ



అభివృద్ధి జరగాలి. కానీ ఆ అభివృద్ధి పేరుతో చట్టాలను పక్కన పెట్టి, ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టి, గిరిజనుల హక్కులకు భంగం కలిగించే పరిస్థితులు ఏర్పడకూడదు.జిల్లా కలెక్టర్ తక్షణమే ప్రత్యేక విచారణకు ఆదేశిస్తారా? ఐటీడీఏ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు





సంయుక్త తనిఖీలు చేపడతారా? ఫిర్యాదులపై కాలయాపనకు స్వస్తి పలికి అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారా.?భద్రాచలం ప్రజలు కోరుతున్నది ఒక్కటే, అభివృద్ధి కావాలి.. కానీ అది చట్టబద్ధంగా జరగాలి. ఏజెన్సీ చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలుకావాలి. మరో విషాదం జరిగే వరకు అధికారులు వేచి చూడకూడదు



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588